Follow: @ANNTELUGU

19-03-2025

# మహా పత్రిక

ANN తెలుగు

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 107 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## నేడు తెలంగాణ బడ్జెట్

**మూడోసారి ప్రవేశపెడుతున్న భట్టి విక్రమార్క**


**తొలిసారి 3 లక్షల కోట్ల మార్క్**

**హైదరాబాద్, మహా:** అసెంబ్లీ సమావేశాల్లో 202526 తెలంగాణ బడ్జెట్ ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం ప్రవేశ పెట్టనున్నారు. గత వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రూ.2.91 లక్షల కోట్లతో ప్రవేశపెట్టగా, తొలిసారి బడ్జెట్ 3లక్షల కోట్ల మార్క్ ను తాకనుంది. బుధవారం ఉదయం 9.30 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్ లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం కానుంది. ఈ సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రివర్గం చర్చించి ఆమోదం తెలుపనుంది. అనంతరం ఉదయం 11.14 గంటలకు భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెడతారు. మరోవైపు శాసనమండలిలో మంత్రి శ్రీధర్ బాబు బడ్జెట్ ను ప్రవేశ పెట్టనున్నారు. రాష్ట్రంలో కీలక పథకాలు, ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయింపులు చేసే అవకాశం ఉంది.

**టాప్ న్యూస్**

### భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనం మహా కుంభమేళా


- 'భారత్ శక్తిని అనుమానించిన వారికి కుంభమేళ గట్టి చెంపదెబ్బ
- పార్లమెంట్‌లో మోదీ కీలక ప్రసంగం



03

### తెలంగాణలో మెరిసిన మిస్ వరల్డ్

- యాదగిరిగుట్టలో ప్రత్యక్షం
- స్వామిని దర్శించుకున్న క్రిస్టినా పిజ్కోవా



03

### 18 మంది సభ్యులతో యాదగిరిగుట్ట బోర్డు

- దేవాదాయ చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- ప్రభుత్వ ఆధీనంలో బోర్డు- మంత్రి కొండా సురేఖ
- బిల్లు బాగుందన్న హరీష్ రావు
- అసెంబ్లీ, కౌన్సిల్ లో కేసీఆర్ పై ప్రశంసలు



02



## బహుజన బాంధవుడు రేవంతన్న



**సీఎంకు అభినందనల వెల్లువ**

**బీసీ బిల్లుపై హర్షాతిరేకాలు**

అసెంబ్లీకి వచ్చి అభినందనలు తెలిపిన బీసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు

పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రి పొన్నం సహా నేతలకు అభినందనలు

**తెలంగాణ వ్యాప్తంగా పండుగ వాతావరణం**

ఆదిలాబాద్ నుండి అశ్వారావుపేట దాకా సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలు

దేశవ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డిని అభినందిస్తూ బీసీసంఘాల నేతల ఫోన్లు

కులం ముసుగులో రాజకీయంగా ఎదగాలని భావించే వారి ఉచ్చులో పడొద్దు సీఎం పిలుపు

**జనగణనలో కులగణన చేర్చేలా పట్టుపడదాం**

**హైదరాబాద్, మహా:** బీసీల సుదీర్ఘకాలంగా చేస్తున్న డిమాండ్ ను నెరవేర్చి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయారు. బహుజనుల బాంధవుడిగా ముఖ్యమంత్రిని కీర్తిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బీసీసంఘాలు, కాంగ్రెస్ నేతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. అసెంబ్లీకి బీసీ సంఘాల నేతలు క్యూకట్టి అభినందనలు తెలిపారు. దశాబ్దాల ఉద్యమ డిమాండ్ ను నెరవేర్చి.. మా కల సాకారం చేశారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీసీల దేవుడిగా కీర్తించారు. మాటలు చెప్పి బీసీల ఓట్లు మాత్రమే వేయించుకున్న నేతలున్న కాలంలో.. రాహుల్ గాంధీ మాట.. రేవంత్ బాట లాగా రాజకీయ ప్రయోజనాలు లేకుండా బీసీ బిల్లును పెట్టి ఆమోదించడం చారిత్రాత్మకమంటూ దేశవ్యాప్తంగా బీసీ సంఘాలు తెలంగాణ ప్రభుత్వాన్ని, రేవంత్ సర్కారును ప్రశంసిస్తున్నాయి.

మిగతా 2లో

## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

**మూడు గ్రూపులు.. 59 కులాలు**

**సీఎం రేవంత్ నాయకత్వంలో మరో చారిత్రక ముందడుగు**

**షమీమ్ అక్తర్ కమిషన్ సిఫార్సులు ఆమోదం**

**వర్గీకరణ అమరుల కుటుంబాలకు అండగా ఉంటామని సీఎం హామీ**



**హైదరాబాద్, మహా:** ఎస్సీ వర్గీకరణ హేతుబద్ధీకరణ బిల్లుకు శాసనసభ ఆమోద ముద్ర వేసింది. 59 ఎస్సీ కులాలను 3 గ్రూపులుగా వర్గీకరిస్తూ బిల్లు ఆమోదించారు. గ్రూప్1లోని అత్యంత వెనుకబడిన 15 కులాలకు 1 శాతం రిజర్వేషన్, మాదిగలున్న గ్రూప్2లోని కులాలకు 9 శాతం రిజర్వేషన్లు, మాలలు ఉన్న గ్రూప్3లోని కులాలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో ఏ ఒక్కరికీ అన్యాయం జరకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతోమంది ప్రాణాలు అర్పించారన్న ముఖ్యమంత్రి తాను సీఎంగా ఉన్నప్పుడు సమస్య పరిష్కారం కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

మిగతా 2లో



### సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం

**కంది శ్రీనివాసరెడ్డి**

బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం

ప్రజాసేవా భవన్ వద్ద సీఎం, మంత్రుల ఫ్లెక్సీలకు పాలాభిషేకం

06

### సంచలన తీర్పు ఇచ్చిన తెలంగాణ హైకోర్టు

**పిటిషనర్‌కు రూ.కోటి జరిమానా**

వివరాలు 2లో



### నేరారోపణలున్న ప్రజా ప్రతినిధులే ఎక్కువ

- దేశవ్యాప్త గణాంకాలను తెలిపిన ఏడీఆర్
- 45 శాతం ఎమ్మెల్యేలపై నేరారోపణలు
- 25 శాతం ఎమ్మెల్యేలపై హత్యా, హత్యాయత్నం, మహిళలపై నేరాల కేసులు
- వారిలో ఏపీలోనే ఎక్కువ మంది

వివరాలు 2లో



ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై

### ఎస్టీ,ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు

- తనను దూషించారంటూ హస్తినాపూర్ కార్పొరేటర్ ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు
- సీఎంను కలిసి కన్నీటి పర్యంతమైన కార్పోరేటర్

వివరాలు 2లో



### బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో మెగా ట్విస్ట్

- రంగంలోకి ఈడీ
- విచారణకు డుమ్మా కొట్టిన విష్ణుప్రియ
- మంచులక్ష్మి నిధి అగర్వాల్ పైనా ఆరోపణలు
- యాప్ లు నిషేధించకుండా.. తెలుగు సెలబ్రిటీలపై అక్కసెందుకున్న ప్రశ్నలు

వివరాలు 2లో

**మరికొద్ది గంటల్లో... భూమి మీదకు**

## సునీతా విలియమ్స్

**8 రోజుల మిషన్.. 9 నెలల హైటెన్షన్**

అంతులేని ఒత్తిడిలోనూ అంతరిక్షాన్ని జయించిన సునీత

సునీత సాహసయాత్రపై భారత్‌లో అభినందనల వెల్లువ

త్వరలో భారత్‌కు రావాలంటూ లేఖ రాసిన ప్రధాని మోదీ

**మహా:** దాదాపు 9 నెలల నిరీక్షణ తర్వాత తిరిగి భూమిపైకి అడుగుపెట్టబోతున్నారు భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, ఆమె సహచర వ్యోమగామి బుచ్ విల్మోర్. వీరు స్పేస్ ఎక్స్ ప్రయాణిస్తున్నక్రూ డ్రాగన్ క్యాప్సుల్ ఎక్కడ ల్యాండ్ అవబోతోంది. గత తొమ్మిది నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ త్వరలోనే భూమ్మీదకు వచ్చేందుకు మార్గం సుగమమైంది.

మిగతా 2లో





### తెలంగాణకు రష్యా పెట్టుబడులు

**పరిశ్రమల స్థాపనకు రష్యా ప్రభుత్వ ప్రతినిధుల ఆసక్తి**

**మంత్రి శ్రీధర్ బాబుతో భేటీ**

02

## 12 జోన్లుగా ఫ్యూచర్ సిటీ విస్తరణ

**ఓఆర్ఆర్ - త్రిబుల్‌ల మధ్య నిర్మాణం.. కొత్తగా రేడియల్ రోడ్లు**

**ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మాణం కానున్న ఫోర్త్ సిటీ**

వివరాలు 2లో



### గ్రామ గ్రామాన సంబరాలు

**నెల రోజుల పాటు పండుగ**

**బీసీ బిల్లు, ఎస్సీవర్గీకరణ చారిత్రాత్మకం**

**పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు**

**హైదరాబాద్, మహా:** బిసి కులగణన, ఎస్సీ వర్గీకరణలపై పెద్దఎత్తున ప్రచారం చేయాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ విజయాలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కోరారు. బీసీ బిల్లు, ఎస్సీవర్గీకరణకు ఆమోదం నేపథ్యంలో మంగళవారం ఎంపీలు,

మిగతా 2లో

# బహుజన బాంధవుడు రేవంతన్న



(మొదటి పేజీ తరువాయి)

వివిధ రాష్ట్రాల బీసీసంఘాల నేతలు కూడా సీఎం రేవంత్ ను అభినందిస్తూ ఫోన్ లు చేశారు. సచివాలయానికి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ను అభినందించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సహా కీలక నేతలు ఇందులో పాల్గొన్నారు.

**ఇదీ ఘనత**

బీసీ రిజర్వేషన్ బిల్లు శాసన సభలోను, శాసన మండలిలో ఆమోదం పొందడంతో ఇక బీసీ రిజర్వేషన్లు పెరగనున్నాయి. ఇప్పటి దాకా విద్య ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో బీసీలకు 29 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. దాన్ని పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా కుల గణన నిర్వహించింది. ఈ గణనలో 56.36 శాతం బీసీలు రాష్ట్రంలో ఉన్నట్లు తేలింది. ఈ మేరకు బీసీలకు 42 శాతానికి రిజర్వేషన్ల పెంచుతూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు సంబంధింత బిల్లులకు చట్ట సభలు ఆమోద ముద్ర వేశాయి. అంటే ఇక నుంచి విద్యా సంస్థల్లో, ప్రభుత్వ నియామకాల్లో, అదే రీతిలో పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పోరేషన్ వంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల ఫలాలు బీసీలకు దక్కనున్నాయి. ఇది చారిత్రాత్మకమని.. బీసీసంఘాలు అభినందిస్తున్నాయి. రాష్ట్ర పరిధిలో ఉన్నదంతా చేశారని, మీ నిబద్ధతకు హ్యాట్సాఫ్ అంటూ బీసీ సంఘాలు, నేతలు చెప్పారు.

**నేనే నాయకత్వం వహిస్తా- సీఎం రేవంత్ రెడ్డి**

బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు జరిగే పోరాటానికి ముందుండి నాయకత్వం వహిస్తానని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా, నిబద్ధతతో నిర్వహించిన కుల సర్వేను తప్పుబడితే బీసీలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని విడమరిచి చెప్పారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును శాసనసభ ఆమోదించిన నేపథ్యంలో రాష్ట్రంలోని ఆయా బీసీ సంఘాలు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 2026 లో జరిపే జన గణనలో కులగణన చేర్చాలని శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. మనం అందరం కలిసి కొట్లాడితే కుల గణనను ఎందుకు చేర్చరు. కొట్లాడితే తెలంగాణ రాలేదా? కొట్లాడితే దేశానికి స్వతంత్రం రాలేదా? కొట్లాడితే జన గణనలో కుల గణన ఎందుకు చేర్చరు. జన గణనలో ఒకసారి కులగణన చేర్చితే ఆ తర్వాత ప్రతి పదేళ్లకోసారి మరింత స్పష్టత వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులగణన చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుంది. ఈ ప్రక్రియలో భాగస్వాములం కావడం మాకు గర్వకారణంగా ఉంది. దీన్ని తప్పుబడితే బీసీలకు తీవ్ర నష్టం జరుగుతుంది. బలహీన వర్గాలు తమ హక్కుల సాధన కోసం చేసే పోరాటానికి పూర్తి మద్దతుగా నిలబడుతా. ఈ సర్వే పునాది లాంటిది. పునాదిలోనే అడ్డుపడితే మీకు మీరే అన్యాయం చేసుకున్నవారవుతారు. ముందు అమలు చేసుకుని తర్వాత అవసరాన్ని బట్టి సవరణలు చేసుకోవచ్చు. ఈ కుల గణన అందరికీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ లాంటిది. కులం ముసుగులో రాజకీయంగా ఎదగాలని భావించే వారి ఉచ్చులో పడొద్దు" అని హితవు చెప్పారు.

# మరికొద్ది గంటల్లో... భూమి మీదకు సునీతా విలియమ్స్

(మొదటి పేజీ తరువాయి)

వారిని తిరిగి భూమిపైకి తీసుకొచ్చేందుకు నాసా స్పేస్ఎక్స్‌లు ప్రయోగించిన క్రూ 10 మిషన్ ఆదివారం ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమైంది. ఆదివారం ఉదయం 9:37 గంటలకు ఈ ప్రక్రియ జరిగినట్లు నాసా వెల్లడించింది. మరోవైపు దీనికి సంబంధించిన ఓ వీడియోను స్పేస్ఎక్స్ విడుదల చేసింది.

**వ్యోమగాములకు స్వాగతం**

తాజాగా అక్కడికి వెళ్లిన నలుగురు వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ స్థానంలో పనిచేయనున్నారు. క్రూ డ్రాగన్ వ్యోమనౌక శనివారం తెల్లవారుజామున (భారత కాలమానం ప్రకారం) 4.33 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయాణం మొదలుపెట్టింది. క్రూ 10 మిషన్‌లో భాగంగా స్పేస్ఎక్స్‌కు చెందిన ఫాల్కన్9 రాకెట్ దీన్ని నింగిలోకి తీసుకెళ్లింది. ఇందులో అమెరికాకు చెందిన ఆన్ మెక్‌క్లెయిన్, నికోల్ అయర్స్, జపాన్ వ్యోమగామి టకుయా ఒనిషి, రష్యాకు చెందిన కిరిల్ పెస్కోవ్‌లు ఉన్నారు. వీరందరూ ఆదివారం ఐఎస్ఎస్‌కు చేరుకొన్నారు. వీరికి సునీత, విల్మోర్ స్వాగతం పలికడం విశేషం.



**సాంకేతిక సమస్యలతో**

2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్ ఐఎస్ఎస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. వాస్తవ ప్రణాళిక ప్రకారం వారిద్దరూ వారం రోజులకే భూమికి తిరిగి రావాల్సి ఉంది. కానీ స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీనితో వ్యోమగాములను తీసుకురాకుండానే అది భూమిని చేరుకుంది. దీంతో వారిద్దరూ ఐఎస్ఎస్‌లోనే చిక్కుకుపోయారు. ఇప్పుడు క్రూ 10లో వీరు తిరిగి భూమిపైకి రానున్నారు.

**భూమిపైకి రాగానే సునీతా ఏం చేస్తారు..**

2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ స్టార్ లైనర్ నౌకలో 7 రోజుల మిషన్ కోసం వెళ్లిన సునీతా, విల్మోర్‌లు సాంకేతిక సమస్యల కారణంగా సుమారు 9 నెలల పాటు అంతరిక్ష కేంద్రంలోనే గడపాల్సి వచ్చింది. ఇంతకాలం సున్నా గురుత్వాకర్షణ శక్తిలో ఉండటం వల్ల శరీరం కండరాలు బలహీన పడటం వల్ల నడవలేకపోవడం, నాడీ సమస్యలు, కంటి చూపు లోపాలు ఇలాంటి ఎన్నో సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుంది. కాబట్టి, భూ వాతావరణంలో అడుగుపెట్టిన తర్వాత ఇక్కడి గ్రావిటీకి వారి శరీరం అలవాటు పడే వరకూ, బలం పుంజుకుని సరైన స్థితికి వచ్చే వరకూ వారిని కొన్ని వారాలు లేదా నెలల పాటు రీహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచుతుంది నాసా. క్రూ డ్రాగన్ క్యాప్సుల్ ఫ్లోరిడాలో ల్యాండ్ కాగానే ముందుగా క్రూని హ్యూస్టన్‌లో ఉన్న నాసా జాన్సన్ స్పేస్ సెంటర్ వద్దకు తీసుకెళతారు. వైద్యపరీక్షలు, పోస్ట్ మిషన్ ఫార్మాలిటీస్ పూర్తిచేసి సాధారణ స్థితికి వచ్చే వరకూ ట్రీట్మెంట్ ఇస్తారు.

## ఇండియన్ డాటర్‌కు స్వాగతం

**భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ సాహసయాత్రపై భారత్‌లో అభినందనల వెల్లువ సాగుతోంది. త్వరలో భారత్‌కు రావాలంటూ ప్రధాని మోదీ లేఖ రాశారు. క్షేమంగా రావాలంటూ గుజరాత్‌లోని ఆమె పూర్వీకుల గ్రామంలో పూజలు, యాగాలు నిర్వహిస్తున్నారు.**

# నేరారోపణలున్న ప్రజా ప్రతినిధులే ఎక్కువ

## దేశవ్యాప్త గణాంకాలను తెలిపిన ఏడీఆర్.. 45 శాతం ఎమ్మెల్యేలపై నేరారోపణలు

### 25 శాతం ఎమ్మెల్యేలపై హత్యా, హత్యాయత్నం, మహిళలపై నేరాల కేసులు.. వారిలో ఏపీలోనే ఎక్కువ మంది

**మహా :** రాజకీయాలలో నేరస్థులు పెరిగిపోతున్నారు. ఈ అంశంపై గత కొంత కాలంగా దేశ వ్యాప్తంగా చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో తాజాగా అసోసియేషన్ ఆఫ్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) అనే సంస్థ దేశ వ్యాప్తంగా ఎంత మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో నేర చరిత్ర కలిగిన వారెంత మంది అన్న వివరాలను బహిర్గతం చేసింది. ప్రస్తుతం ఈ రిపోర్టుపై రాజకీయ, పోలీసు వర్గాలతో పాటు సామాన్య ప్రజల్లోనూ జోరుగా చర్చ మొదలైంది. దేశంలో మొత్తం 4,123 మంది ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో 4,092 మంది నేరారోపణలు ఎదుర్కుంటున్నట్లు ఏడీఆర్ తన నివేదికలో పేర్కొంది. దశ వ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేలలో దాదాపు 45 శాతం అంటే 1,861 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. అందులో ఆంధ్రప్రదేశ్ టాప్‌లో ఉందని నివేదిక వెల్లడించింది. నివేదికను పరిశీలిస్తే కోర్టులు, పోలీస్‌స్టేషన్, జైళ్ల చుట్టూ తిరగాల్సిన వారంత దర్జాగా చట్టసభల్లో కూర్చుంటున్నారు. దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అన్నీ కలిపి 4,123 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఎన్నికల టైంలో అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ ఆధారంగా ఏడీఆర్ వారిపై ఉన్న కేసులను స్టడీ చేసింది. వాటిని నేరారోపణలు, తీవ్రమైన నేరారోపణలు రెండు భాగాలుగా విభజించింది. మొత్తం 4,123 మంది ఎమ్మెల్యేల్లో 4,092 మంది క్రిమినల్ రిపోర్ట్‌ను ఏడీఆర్ వెలికితీసింది. ఈ రిపోర్ట్ ప్రకారం మొత్తం ఎమ్మెల్యేల్లో దాదాపు 45 శాతం అంటే 1,861 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వారిలో 25 శాతం అంటే 1,205 మంది హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై నేరాలు వంటి తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. అంతేకాదు వారి ఆస్తుల విలువ కూడా ఎక్కువే. అన్ని రాష్ట్ర అసెంబ్లీల్లోని ఎమ్మెల్యేల ఆస్తులు రూ.17.92 కోట్లు కాగా క్రిమినల్ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల ఆస్తులు రూ. 20.97 కోట్లుగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.



ఆంధ్రప్రదేశ్‌లోని 174 మంది ఎమ్మెల్యేల్లో 138 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల లిస్ట్‌లో ఏపీ 59 శాతంతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత 50 శాతంతో తెలంగాణ, 49 శాతంతో బీహార్ రాష్ట్రాలు ఉన్నాయి. ఇక సాధారణ కేసుల్లో 70 శాతం ఏపీ ఎమ్మెల్యేలు నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. ఆ తర్వాత కేరళ, తెలంగాణలలో 69 శాతం, బీహార్ రాష్ట్రం 66 శాతం, మహారాష్ట్రలో 65 శాతం, తమిళనాడులో 59 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. పార్టీల వారీగా చూస్తే తెలుగుదేశం పార్టీ 86 శాతంతో టాప్‌లో ఉంది. 134 మందిలో 115 మంది శాసనసభ్యులపై నేరారోపణలు ఉన్నాయి. అంతేకాదు.. టీడీపీకి చెందిన 61 శాతం (82 మంది ఎమ్మెల్యేలు) ఎమ్మెల్యేలు తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దేశంలో బీజేపీకి చెందిన ఎమ్మెల్యేల్లో దాదాపు 39 శాతం అంటే 1,653 మంది శాసనసభ్యుల్లో 638 మంది క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించారు. వారిలో 436 మంది అంటే 26 శాతం మంది తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇక 646 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో 52శాతం అంటే 339 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 194 మందిపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని సదరు నివేదిక వెల్లడించింది. తమిళనాడు అధికార డీఎంకేలో 74 శాతం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేల్లో దాదాపు 41 శాతం ఎమ్మెల్యేలు నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా 54 మంది ఎమ్మెల్యేలు మర్డర్ కేసులో, 226 మందిపై హత్యయత్నం కేసు, 127 మందిపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులను ఎదుర్కొంటున్నారు. వీరిలో 13 మంది అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు.

# తెలంగాణలో మెరిసిన మిస్ వరల్డ్


**మహా :** మిస్ వరల్డ్ 2024 టైటిల్ ఎగురేసుకెళ్లిన చెక్ రిపబ్లిక్ సుందరి క్రిస్టినా పిజ్కోవా తెలంగాణలో ప్రత్యక్షం అయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రఖ్యాతి చెందిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలా చీరెకట్టు.. బొట్టుతో మెరిసిపోయారు. ప్రపంచ పర్యటనలో భాగంగా భారత్‌కు వచ్చారామె. తెలంగాణలో అడుగు పెట్టారు. ఈ ఉదయం యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ నిర్మాణ శైలికి ముగ్ధులయ్యారు. యాదగిరిగుట్టను సందర్శించడం ఆనందాన్నిఇస్తోందని, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మించారంటూ ప్రశంసించారు. ఆలయాన్ని సందర్శించడం మన శ్యాంతిని కలిగించిందంటూ వ్యాఖ్యానించారు. ఈ ఏడాది మే 7 నుండి 31వ తేదీ వరకు మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యాన్ని ఇవ్వనుంది తెలంగాణ. భారత్ సహా ప్రపంచం నలుమూలల నుండి 120కి పైగా దేశాలకు చెందిన యువతులు ఇందులో పాల్గొనబోతున్నారు. తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఇది 72వ ఎడిషన్. మిస్ వరల్డ్ ప్రారంభం, ముగింపు వేడుకలు, గ్రాండ్ ఫినాలే మొత్తం హైదరాబాద్‌లోనే ఉండబోతోంది. దీనికి సంబంధించిన ఓ అధికారిక ప్రకటనను మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్‌పర్సన్, సీఈఓ జూలియా మోర్లే ఇదివరకే విడుదల చేసిన విషయం తెలిసిందే. తెలంగాణ పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌ను సైతం కలిశారు. తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించడంలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చారు క్రిస్టినా పిజ్కోవా. యాదాద్రి ఆలయాన్ని సందర్శించారు. ఇది ఆరంభం మాత్రమేనని, తెలంగాణ, ఇక్కడ నిక్షిప్తమై ఉన్న రత్నాల్లాంటి అద్భుత ప్రదేశాలను చూడటానికి అతృతతో ఎదురు చూస్తున్నానంటూ వ్యాఖ్యానించారు.

# 12 జోన్లుగా ఫ్యూచర్ సిటీ విస్తరణ

## ఓఆర్ఆర్ - త్రిబుల్ ల మధ్య నిర్మాణం.. కొత్తగా రేడియల్ రోడ్లు

### ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మాణం కానున్న ఫోర్త్ సిటీ

**మహా :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీ నిర్మితమవుతోంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఫ్యూచర్ సిటీని ప్లాన్ చేసిన ప్రభుత్వం 12 జోన్లుగా విస్తరించాలని నిర్ణయించారు. అందులో ప్రపంచస్థాయి ప్రమాణాలతో పాటు సౌకర్యాలతో రేడియల్ రోడ్లు కూడా నిర్మించనున్నారు. ఫ్యూచర్ సిటీ, రేడియల్ రోడ్ల నిర్మాణం, డిజైన్లు, తదితర అంశాలపై అధికారులు తీవ్ర స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ప్రపంచంలోన పేరొందిన పట్టణాలను పరిశీలించిన అధికారుల బృందం, వాటన్నింటినీ తలదన్నేలా నిర్మించాలన్న సంకల్పంతో డిజైన్లను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న హైదరాబాద్ మహానగర విస్తరణపై రేవంత్ సర్కార్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. దాదాపు 30 వేల ఎకరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు రేవంత్ సర్కార్ రెడీ అయింది. ఇందులో భాగంగా హెచ్ఎండీఏ తరహాలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ (ఎఫ్ సీడీఏ)ని ఏర్పాటు చేసింది. దీనికి ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ప్రస్తుత హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య మొత్తం 56 గ్రామాలతో ఈ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నారు. అయితే ఈ అథారిటీ పరిధిలోకి వచ్చే ప్రాంతాలను పక్కా మాస్టర్ ప్లాన్ ప్రకారం అద్భుతంగా డెవలప్ చేయనున్నారు. ప్రస్తుతం ఎఫ్ సీడీఏ పరిధిలోకి 56 గ్రామాలను తీసుకున్నారు. గతంలో ఇందులోని కొన్ని గ్రామాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా, తాజాగా ఎఫ్‌సీడీఏ పరిధిలో కలిపారు.



ఔటర్ రింగ్ రోడ్ అవతల, శ్రీశైలం నేషనల్ హైవే, నాగార్జున సాగర్ స్టేట్ హైవేల పరిధిలోని పలు గ్రామాలను సైతం దీని పరిధిలోకి తీసుకొచ్చారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ పరిధిలోని శంషాబాద్, దాని పరిసర ప్రాంతాలు సైతం ఎఫ్‌సీడీఏ పరిధిలో చేర్చారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా మీర్‌ఖాన్ పేట గ్రామంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ అండ్ ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నారు. దీంతో పాటుగా అథారిటీ పరిధిలోని పలు హబ్ లను కలిపి 12 జోన్లుగా విస్తరించే ఛాన్స్ ఉందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతంలోనే తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (టీజీఐఐసీ) ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ క్లస్టర్లు, ఎకనామిక్ జోన్ లు అభివృద్ధి చేయనున్నారు. అథారిటీ పరిధిలోనే కాంప్రహెన్సివల్ మాస్టర్ ప్లాన్ తో పాటు అన్ని ప్రాంతాలకు మల్టీ మోడల్ కనెక్టివిటీ, మోడరన్ అర్బన్ ఎమినిటీస్ సైతం కల్పించనున్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో కొత్తగా రేడియల్ రోడ్లు, మెట్రోరైల్ కనెక్టివిటీని కూడా అవకాశం కల్పించనున్నారు. ఫ్యూచర్ సిటీ మెట్రోపై ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.

# 18 మంది సభ్యులతో యాదగిరిగుట్ట బోర్డు

**హైదరాబాద్, మహా:** 18 మంది సభ్యులతో యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు ఉంటుందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. దేవాదాయ చట్ట సవరణ బిల్లుపై మంగళవారం తెలంగాణ అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట దేవస్థానానికి ఆలయ పాలక మండలి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలిపారు. 18 మంది సభ్యులతో యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు ఉంటుందని, వీరి పదవీ కాలం రెండు సంవత్సరాలుగా పేర్కొన్నారు. కాగా బోర్డు చైర్మన్‌కు, సభ్యులకు ఎలాంటి జీతభత్యాలు ఉండవని, డీఏలు మాత్రం ఉంటాయని అన్నారు. ఆలయ ఈవోగా ఐఏఎస్ అధికారి ఉంటారని వెల్లడించారు. బోర్డు బడ్జెట్ ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటుందని.. బోర్డు ఆధ్వర్యంలో, యాదగిరిగుట్టలో విద్యాసంస్థలను, ఆధ్యాత్మిక పాఠశాలలను నెలకొల్పి, నిర్వహించవచ్చునని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో రాష్ట్రంలోని దేవాలయాలకు భక్తుల తాకిడి పెరిగిందన్నారు. గతంలో యాదగిరిగుట్టలో సాధారణ భక్తులకు సరైన సదుపాయాలు లేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లు ఖర్చు చేసి వసతులు ఏర్పాటు చేసిందన్నారు. ఇంకా మంచి సౌకర్యాల కల్పనకు పాలకమండలి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేసిందన్నారు. పాలకమండలి ఆధ్వర్యంలో యాదగిరిగుట్టను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. తెలంగాణలో రూ.100 కోట్ల ఆదాయం వచ్చే అలయాలన్నీ దేవాదాయశాఖ ఆధ్వర్యంలోనే పనిచేస్తాయని సురేఖ పేర్కొన్నారు. యాదగిరిగుట్టకు ఏటా రూ.200కోట్ల ఆదాయం లభిస్తోందన్నారు. బిల్లుపై మాట్లాడిన హరీష్ రావు అధికారులను, ప్రభుత్వాన్ని అభినందించారు. బిల్లు బాగా రూపొందించారని, వేములవాడకు కూడా బోర్డు ఏర్పాటుచేయాలని సూచించారు. కౌన్సిల్ లో, అసెంబ్లీలో పలువురు అధికారపార్టీ సభ్యులు ఆలయాన్ని పునరుద్దరించడంలో కేసీఆర్ విజన్ , పట్టుదల గొప్పదని ప్రశంసించారు.



# గ్రామ గ్రామాన సంబరాలు

## నెల రోజుల పాటు పండుగ

### బీసీ బిల్లు, ఎస్సీవర్గీకరణ చారిత్రాత్మకం.. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, పోటీ చేసిన అభ్యర్థులతో జూమ్ మీటింగ్ నిర్వహించగా, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణునాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా అసెంబ్లీలో బిసి కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులను ఆమోదించుకున్నామని, ఇవి చరిత్రలోనే నిలిచిపోయే ఘట్టాలన్నారు. స్వతంత్ర భారత చరిత్రలో ఏ రాష్ట్రంలో కుల గణన జరపలేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు, ఎస్సి వర్గీకరణ కు ఆమోదం తెలిపామని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్, చేవెళ్ల డిక్లరేషన్ లను ప్రకటించి ఇప్పుడు ఆమోదం తెలిపిందన్నారు. ఇప్పుడు మనం




చేసుకున్న రెండు తీర్మానాలు సామాజిక విప్లవానికి పునాదులు పడ్డాయన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగా ఏర్పడినపుడు ఎంత సంతోషపడ్డమో ఇప్పుడు అంత సంతోషంగా ఉన్నామన్నారు. ఇంత సంతోషాన్ని పల్లెల్లో ఇంటింటికి పంచాలి..పెద్ద ఎత్తున సంబరాలు చేయాలి .నెల రోజుల పాటు ఈ సంబరాలు నిర్వహించాలని సూచించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాలను కూడా నిర్వహించాలన్నారు. ఈ అభియాన్ కార్యక్రమాలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని అందిస్తామని, బాణాసంచా కాల్చి, ఫ్లెక్సీలు పెట్టి, ఇంటింటికి కరపత్రాలు పంచి, ఊర్లలో పండగలాగా సంబరాలు నిర్వహించాలన్నారు. స్టేజి మీటింగ్ లు, ప్రెస్ మీట్ లు నిర్వహించాలన్నారు. వీటి ప్రాముఖ్యత ను అందరికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సిఫార్సులు చేసిందని వెల్లడించారు.

**ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని తెలిపారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందని అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్రంలో వివిధ శాఖల బాధ్యతలు అప్పగించి గౌరవించిందని, దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్యను సీఎంగా చేసింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగిందని, దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారని అన్నారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నించిందని తెలిపారు.

**సభ్యులకు సీఎం కృతజ్ఞతలు**

సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించామని అన్నారు. వెంటనే ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించామని, మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ నియమించామని, కమిషన్ ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించిందని వివరించారు. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించామని, 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించిందని, 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫార్సులు చేసిందని వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో మెగా ట్విస్ట్

## రంగంలోకి ఈడీ.. విచారణకు డుమ్మా కొట్టిన విష్ణుప్రియ మంచులక్ష్మి, నిధి అగర్వాల్ పైనా ఆరోపణలు

### యాప్ లు నిషేదించకుండా.. తెలుగు సెలబ్రిటీలపై అక్కసెందుకున్న ప్రశ్నలు



**హైదరాబాద్, మహా:** బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ల కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. కాసులకు కక్కుర్తి పడి వేల మంది ప్రాణాలు పోవడానికి కారణమవుతోన్న బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్లు చేస్తోన్న సెలబ్రెటీలపై ఇప్పటికే పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగానే 11 మంది సెలబ్రెటీలపై కేసులు నమోదు చేశారు. వీరికి నోటీసులు జారీ చేసి.. విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. విష్ణుప్రియ, తేజలను విచారణకు పిలవగా, విష్ణుప్రియ పంజాగుట్ట పిఎస్ లో విచారణకు డుమ్మాకొట్టింది. మరోవైపు బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ కేసులో ట్విస్ట్ నెలకొంది. బెట్టింగ్ యాప్స్ వ్యవహారం కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కి చేరింది. బెట్టింగ్ యాప్స్ ప్రచారం చేసిన యూట్యూబర్ల వ్యవహారంపై ఈడీ ఆరా తీస్తోన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు నమోదు చేసిన కేసు వివరాలను తెప్పించుకున్న ఈడీ.. బెట్టింగ్ యాప్స్ చెల్లింపులపై విచారిస్తోన్నట్లు తెలిసింది. మనీ లాండరింగ్, హవాలా రూపంలో చెల్లింపులు జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తోన్న ఈడీ.. పోలీసులు కేసు నమోదు చేసిన 11 మంది యూట్యూబర్ల సంపాదనపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. త్వరలోనే వీరికి నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచేందుకు ఈడీ రంగం సిద్ధం చేస్తోన్నట్లు టాక్. ఈడీ ఎంట్రీతో ఈ కేసులో నెక్స్ ఏం జరగబోతుందని ఉత్కంఠ నెలకొంది. కాగా, బెట్టింగ్ యాప్‌లు ప్రమోషన్ చేస్తున్న 11మంది తెలుగు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయన్సర్లపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. వీరిలో విష్ణుప్రియ, బండారు శేషసాయిని సుప్రిత, ఇమ్రాన్ ఖాన్ (పరేషన్ బాయ్స్), హర్ష సాయి, రీతు చౌదరి , టేస్టీ తేజ, యాంకర్ శ్యామల, కిరణ్ గౌడ్, అజయ్, సన్నీ యాదవ్, సుదీర్‌లపై గేమింగ్ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా నెటిజన్లు ప్రమోషన్ చేసిన స్టార్లను వెతికిమరీ నెట్టింట పెడుతున్నారు. ఈ క్రమంలోనే మంచులక్ష్మి, నిధి అగర్వాల్ పైనా చర్యలు తీసుకోవాలని ప్రమోషన్ వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాజల్ అగర్వాల్ వీడియోలు పోస్ట్ చేసినా ఆమెపై కేసు పెట్టలేదు. తెలుగు సెలబ్రిటీలపైనే పోలీసులు కేసులు పెడుతున్నారు. యాప్ లను నిషేదించకుండా కేవలం తెలుగు సెలబ్రిటీలపైనే కేసులు పెడుతుండడంపై చర్చ జరుగుతోంది.

# భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనం మహా కుంభమేళా

### 'భారత్ శక్తిని అనుమానించిన వారికి కుంభమేళ గట్టి చెంపదెబ్బ.. పార్లమెంట్‌లో మోదీ కీలక ప్రసంగం



**మహా :** మహా కుంభమేళా విజయం భిన్నత్వంలో ఏకత్వానికి ఓ నిదర్శనమని ప్రధాని మోదీ అన్నారు. ఈ క్రతువు దేశ ప్రజల ఐక్యతను, భారత్ గొప్పతనాన్ని యావత్ ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా లోక్‌సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ, ఎర్రకోట నుంచి సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ ప్రాముఖ్యతను ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. యావత్ ప్రపంచం భారత్ శక్తి సామర్థ్యాలను మహాకుంభమేళా రూపంలో చూసిందన్నారు. భారత్ శక్తి సామర్థ్యంపై ప్రశ్నలు లేవనెత్తేవారికి మహాకుంభమేళా గట్టి సమాధానం ఇచ్చిందని ప్రధాని మోదీ తెలిపారు. 'గతేడాది జరిగిన రామమందిరం ప్రాణప్రతిష్ట వేడుక వేళ దేశం వచ్చే వెయ్యి సంవత్సరాలకు ఏ విధంగా సిద్ధమవుతుందో చూశాం. సరిగ్గా ఏడాది తర్వాత జరిగిన మహాకుంభమేళా మనందరి ఈ సంకల్పాన్ని మరింత బలోపేతం చేసింది. ప్రజల సామూహిక చేతనను, దేశ సామర్థ్యాన్ని చాటింది. మానవ జీవితంలో కూడా ఇలాంటి అనేక క్రతువులు వస్తాయి. అవి వేలాది సంవత్సరాలతోపాటు రాబోయే తరాలకు ఉదాహరణగా నిలుస్తాయి. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళాను కూడా ఆ విధంగానే భావిస్తాను. ఇందులో జాగృతమవుతున్న దేశం కనిపిస్తుంది. మనం నెలన్నర రోజుల పాటు దేశంలో మహా కుంభ్ ఉత్సాహం చూశాం. ఈ విధంగా సదుపాయాలు, సదుపాయాల లేమిని మించి కోట్లాది మంది భక్తులు భక్తితో ఒకచోటకు చేరటం అతిపెద్ద బలం. కానీ ఈ ఉత్సాహం ఇంతటితోనే ఆగకూడదు' అని మోదీ అన్నారు.

**మహాకుంభ మేళ జరిగిందిలా!**

ప్రతీ 12 ఏళ్లకు ఓసారి నిర్వహించే ఈ మహా కుంభమేళా 2025 జనవరి 13న మొదలై ఫిబ్రవరి 26 వరకు కొనసాగింది. కోట్లాదిమంది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి తరించారు. కుంభమేళా ముగిసిన తర్వాత ప్రధాని మోదీ ఓ పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే. 'దేశంలో సరికొత్త ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసిందని, ఇదే స్ఫూర్తితో, ఇదే ఆత్మవిశ్వాసంతో వికసిత భారత్ దిశగా అడుగులు వేయడానికి పునరంకితం కావాలని' మోదీ పిలుపునిచ్చారు. 'ఆధ్యాత్మిక వేడుకలో ఏమైనా పొరపాట్లు జరిగితే క్షమించాలని గంగ, యమున, సరస్వతి నదీమ తల్లులతోపాటు ప్రజల్ని కోరారు. తన దృష్టిలో ప్రజలూ దేవుడి ప్రతిరూపాలే' అని పేర్కొన్నారు. "ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదు. అమెరికా జనాభా కంటే దాదాపు రెండింతల మంది భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. అంచనాలను మించి ప్రజలు, భక్తులు తరలివచ్చారు. ఐక్యతతో ఈ మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది" అని అప్పుడు తన బ్లాగ్‌లో మోదీ రాశారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కనిపించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేనని ఆయన అన్నారు.

# తెలంగాణకు రష్యా పెట్టుబడులు

## పరిశ్రమల స్థాపనకు రష్యా ప్రభుత్వప్రతినిధుల ఆసక్తి

### మంత్రి శ్రీధర్ బాబుతో భేటీ



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు రష్యా ప్రభుత్వం ఆసక్తిగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. పరిశ్రమలు పెట్టాలనుకున్నావారికి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మంగళవారం అసెంబ్లీ సమావేశ మందిరంలో రష్యా ప్రభుత్వ ప్రతినిధులు మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పారిశ్రామికవేత్తలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలను మంత్రి వివరించారు. గ్లోబల్ కేపిటల్ ఆఫ్ ఏఐ గా తెలంగాణను తీర్చి దిద్దేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా 200 ఎకరాల్లో ఏఐ సిటీ ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టులో రష్యా కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా చొరవ చూపాలని ప్రతినిధులను కోరారు. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీస్ లో ప్రపంచ స్థాయి నిపుణులను తయారు చేసేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ కంపెనీల్లో అధిక శాతం తెలంగాణలో తమ కార్యకలాపాలను నిర్వర్తిస్తున్నాయన్నారు. జీసీసీలకు హబ్, వ్యాక్సిన్ కేపిటల్‌గా హైదరాబాద్ మారిందన్నారు. యూఎస్ తర్వాత అతి పెద్ద జీసీసీని అమ్జెన్ హైదరాబాద్ లో ఏర్పాటు చేయడం తమకు గర్వకారణమన్నారు. టీ హబ్, టీ వర్క్స్ వంటి సంస్థల ద్వారా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఐటీ, ఇన్నోవేషన్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఇతర అంశాల్లో రష్యా ప్రభుత్వం తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పౌర సేవలను ప్రజల ముంగిటకు చేర్చేందుకు రష్యాలో అమలవుతున్న ఉత్తమ పద్ధతులపై అధ్యయనం చేస్తామన్నారు. ఈ సమావేశంలో రష్యా ప్రభుత్వ ప్రతినిధులు లిడ్మిలా ఒగారోడోవా, డిమిత్రీ స్టారోస్టిన్, రామిల్ ఖిస్మాటుల్లిన్, వెరా ప్రోంకినా, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, టీజీఐఐసీ సీఈవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై ఎస్టీ, ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు

### తనను దూషించారంటూ హస్తినాపూర్ కార్పొరేటర్ ఫిర్యాదు

### కేసు నమోదు చేసిన పోలీసులు

### సీఎంను కలిసి కన్నీటిపర్యంతమైన కార్పొరేటర్



**హైదరాబాద్, మహా:** ఎల్బీనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తనను కులం పేరుతో దూషించారని హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ ఆరోపించారు. అసెంబ్లీ సమావేశంలో ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డిని కలిసినట్లు ఆమె తెలిపారు. గన్‌పార్క్ వద్దకు చేరుకున్న ఆమె ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కులం పేరుతో గత కొన్నేళ్లుగా అవమానించి మానసికంగా ఇబ్బంది పెడుతున్నాడని తాజాగా తనను హనీమూన్ అనే పదంతో దూషించారని తీవ్ర ఆరోపణలు చేశారు. వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలు రాజకీయాల్లోకి వస్తే ప్రోత్సహించాల్సింది పోయి వ్యక్తిగత విమర్శలు, కులంతో దూషించడం చేసి మనోవేదనకు గురి చేస్తున్నారని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే సుధీర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందని, త్వరలో శిక్ష కూడా పడుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. దీనిపై మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కూడా ఆయన్ను పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు. మరోవైపు మహిళా కమిషన్ కూడా ఎమ్మెల్యేపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటీస్ జారీచేసింది.

# నేను సీనియర్, నాకెవరూ చెప్పాల్సిన అవసరం లేదు

## ఎవరిమాట వినాల్సిన అవసరం నాకు లేదు

### మంత్రులు నోట్ చేసుకున్నామని చెప్పి తర్వాత డస్ట్ బిన్ లో పడేస్తారని వ్యాఖ్య

### అసెంబ్లీలో ఎమ్మెల్యే దానం హాట్ హాట్



**మహా :** అధికారుల తీరుపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఫైర్ అయ్యారు. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడిన ఆయన అప్లయ్.. అప్లయ్ నో రిప్లయ్ అన్నట్లుగా ఇక్కడ నడుస్తోందని వ్యాఖ్యానించారు. తనకు తెలియకుండానే తన నియోజకవర్గంలోని ఓ ఈద్గా గ్రౌండ్ వద్ద సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారని నేను నా రెగ్యులర్ స్టైల్ లో వెళ్లి పగలగొట్టానని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇదే స్థలానికి పక్కన ఉన్న మరికొంత స్థలంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కోసం ల్యాండ్ ఇవ్వమంటే అధికారులు ఇవ్వలేక పోయారు కానీ ఆ పక్కనే ఉన్న ఈద్గా గ్రౌండ్ లో లోకల్ ఎమ్మెల్యేను నా దృష్టికి తేకుండానే సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారన్నారు. అందుకే నాకు వేరే ఆప్షన్ లేక దాన్ని పగలగొట్టానన్నారు. అలాగే మిడ్ డే మీల్స్ లో విద్యార్థులకు ఎగ్స్ ఇవ్వడం లేదని ఆ పిల్లలకు మనం ఎగ్స్ ఇవ్వాలి కదా అన్నారు. నాకు సమాచారం ఇవ్వకుండా సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారంటూ వారిపై ప్రివిలైజ్ మోషన్ పిటిషన్ ఇస్తానని అన్నారు. అధికారులు, అధికారులు మాట్లాడుకుని కాంప్రమైజ్ అవుతున్నారంటూ, ఎమ్మెల్యేలు చెప్పినా వినడం లేదని మండిపడ్డారు. నేను కూడా మంత్రిగా పని చేశా. నాకు తెలుసు ఏం మాట్లాడాలో అని దానం అన్నారు. అలాగే స్కూల్ పిల్లకు మిడ్ డే మీల్స్ లో ఎగ్స్ అందించడం, ఆర్ఓఆర్ ప్లాంట్స్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. వీటిపై మంత్రులు నోట్ చేసుకున్నామంటరు ఆ తర్వాత తీసుకెళ్లి డస్ట్ బిన్ లో వేస్తరు. ఇది నేను చేశాను కాబట్టి చెప్తున్నానని అన్నారు. ఎవ్వరినీ బ్లేమ్ చేయడం లేదని దానం తెలిపారు. నా నియోజకవర్గం పరిధిలోని అంశాలపై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని నోట్ చేసుకుంటామని చెప్పడం కాదన్నారు. నాకు ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. నాకు తెలుసు ఏం మాట్లాడాలో అందరికంటే సీనియర్ ఎమ్మెల్యేను నేను అంటూ కామెంట్స్ చేశారు. నూతన భవనాల నిర్మాణాల విషయంలో సోషల్ మీడియాలో చిన్నచిన్న పత్రికలతో బ్లాక్ మెయిల్ లో చేస్తున్నారు. వీరికి జీహెచ్ఎంసీ అధికారులు వణికిపోతున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఫోన్ చేసినా స్పందించరు కానీ సోషల్ మీడియా పర్సన్స్ ఫోన్ చేస్తే మాత్రం భయపడుతున్నారన్నారు. ఆ తర్వాత అధికారులు వారు కలిసి లావాదేవీలు చేసుకుంటున్నారని ఆరోపించారు. వీటిపై యాక్షన్ తీసుకోవాలని కోరారు.

# ఓటర్ ఐడీ-ఆధార్ అనుసంధానం

## త్వరలోనే ఈసీ, యూఐడీఏఐ నిపుణుల సంప్రదింపులు




**మహా:** ఆధార్ కార్డులతో ఓటరు గుర్తింపు కార్డులను అనుసంధానించే అంశంపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మంగళవారం కీలక ప్రకటన చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలు, సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆధార్‌తో ఓటరు ఐడీలను అనుసంధానిస్తామని వెల్లడించింది. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలపై త్వరలోనే యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఈసీలకు చెందిన నిపుణులు సంప్రదింపులు జరుపుతారని ఎన్నికల సంఘం తెలిపింది. ఈ అంశంపై చర్చించేందుకు ఇవాళ (మంగళవారం) ఈసీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో కేంద్ర హోంశాఖ, న్యాయశాఖ, ఐటీ శాఖల కార్యదర్శులు, యూఐడీఏఐ సీఈఓ పాల్గొన్నారు. "రాజ్యాంగంలోని ఆర్టికల్ 326ప్రకారం ఓటు హక్కు భారత పౌరులకు మాత్రమే ఉంది. ఒక వ్యక్తి ఉనికిని నిర్ధరించడానికి ఆధార్ ప్రాతిపదికగా నిలుస్తుంది. అందుకే మేం ఓటరు ఐడీని ఆధార్‌తో లింక్ చేస్తున్నాం. 1950 ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 23(4), 23(5), 23(6) సెక్షన్ల ప్రకారం, 2023లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారమే మేం ఈ ప్రక్రియను చేపడుతున్నాం" అని ఈసీ ఓ ప్రకటనలో తెలిపింది.

**అది స్వచ్ఛందమే!**

ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటరు ఐడీతో ఆధార్ కార్డును లింక్ చేసుకోవచ్చు. ఆధార్‌ఓటర్ ఐడీల అనుసంధానాన్ని పూర్తి చేయడానికి నిర్దిష్ట గడువేదీ లేదని ఇప్పటికే పార్లమెంటుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యం మాత్రమే తమకు ఉందని పేర్కొంది. ఓటరు ఐడీతో ఆధార్‌ను లింక్ చేసుకోని వారి పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగించే ప్రసక్తే లేదని కేంద్రం స్పష్టం చేసింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 23ని 2021 ఎన్నికల చట్టాల సవరణ చట్టం ద్వారా సవరించారు. దీని ప్రకారం, "ఒక భారత పౌరుడి ఓటరు గుర్తింపును నిర్ధరించేందుకు, ఆధార్ కార్డును స్వచ్ఛందంగా చూపించమని అతడిని అడిగే అధికారం ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులకు ఉంటుంది".

# చర్లపల్లి రైల్వే టర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు

## రైల్వే మంత్రికి సీఎం రేవంత్ లేఖ



హైదరాబాద్ శివార్లలోని చర్లపల్లిలో నిర్మించిన కొత్త రైల్వే టర్మినల్ స్టేషన్ కు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి రైల్వే శాఖను కోరారు. ఈ మేరకు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు లేఖ రాశారు. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పునాది వేసిన పొట్టి శ్రీరాములు త్యాగాలను స్మరిస్తూ చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌కు వారి పేరును పెట్టాలని తెలంగాణ ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు, సంస్కృతికి గర్వకారణమైన పొట్టి శ్రీరాములు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని, సామాజిక న్యాయం కోసం, అణగారిన వర్గాల కోసం ఆయన ఎనలేని కృషి చేశారని రేవంత్ రెడ్డి లేఖలో పేర్కొన్నారకు. సమాజంలో అన్ని వర్గాలకు సమాన హక్కులు ఉండాలని పోరాడిన పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ నిరాహార దీక్ష వారి నిస్వార్థ త్యాగానికి, తెలుగువారికి గర్వకారణంగా నిలుస్తుందన్నారు. కొత్త రైల్వే టర్మినల్ ఏర్పాటు ద్వారా తెలంగాణ మౌలిక సదుపాయాల కల్పనలో అదనపు ప్రయోజనం చేకూరిందని, తెలంగాణ రైజింగ్ దార్శనికతకు ఇదెంతగానో తోడ్పడుతుందన్నారు. రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న తమ లక్ష్యసాధనకు ఈ కొత్త రవాణా కేంద్రం ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. అందుకు రైల్వే మంత్రి గారికి నా అభినందనలు అని రేవంత్ రెడ్డి లేఖలో తెలిపారు. తెలుగు ప్రజల కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలకు గుర్తుగా చెర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌కు వారి పేరును పెట్టి గౌరవించుకోవలసిన అవసరం దని, అది వారి అసమాన అంకిత భావానికి నివాళిగా భావిస్తున్నామన్నారు. మా విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని రైల్వే టెర్మినల్ స్టేషన్ పేరును మార్చాలని కోరుతున్నామని, ఈ విషయంలో మీరందించే సహకారం ఒక గొప్ప అడుగు అవుతుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు, తెలుగు మాట్లాడే ప్రజలందరూ దీనిని ఎంతగానో అభినందిస్తారని, మా విజ్ఞప్తి విషయంలో సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నామని సీఎం రేవంత్ లేఖలో పేర్కొన్నారు.

కాగా, తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టిన సంగతి తెలిసిందే. పొట్టి శ్రీరాములు బదులుగా సురవరం ప్రతాపరెడ్డి పేరును ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో పొట్టి శ్రీరాములుకు కూడా సరైన గౌరవం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని తాజాగా రైల్వే మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాశారు.

# సంచలన తీర్పు ఇచ్చిన తెలంగాణ హైకోర్టు

## పిటిషనర్‌కు రూ.కోటి జరిమానా



**మహా :** తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక సంచలన తీర్పు వెలువరించారు. ఉన్నత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించిన పిటిషనర్ వెంకట్రామిరెడ్డికి రూ.కోటి జరిమానా విధించారు. బండ్లగూడ మండలం కందికల్‌లో సర్వే నెంబర్ 310/1, 310/2లలో 9.11 ఎకరాల భూమి ఉందని, ఈ భూమిని అధికారులు రిజిస్ట్రేషన్ చేయడం లేదని వెంకట్రామిరెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ తరపున న్యాయవాది కందగట్ల ధీరజ్ వాదనలు వినిపించారు. భూములు రిజిస్ట్రేషన్ చేయొద్దంటూ బండ్లగూడ తహశీల్దార్ లేఖ రాశారని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పిటిషనర్ తన భూమిని సేల్ డీడ్ చేసుకునేలా రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించాలని కోరారు.

పిటిషనర్ పేర్కొన్న సర్వే నెంబర్లు కందికల్ గ్రామంలో లేవని, ఆ గ్రామంలో 309/5తోనే సర్వేనెంబర్ ముగుస్తుందని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. తప్పుడు పత్రాలు సృష్టించి వెంకట్రామిరెడ్డి ప్రభుత్వ భూమిని కాజేయాలని చూస్తున్నారని వివరించారు. ఈ భూమిపై గతంలోనే పిటిషనర్ తండ్రి హైకోర్టులో రెండు పిటిషన్లు వేశారని, వేర్వేరుగా దాఖలు చేసిన రెండు పిటిషన్లను ఆయన విరమించుకున్నారని ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ పిటిషన్ల గురించి వెంకట్రామిరెడ్డి తన అఫిడవిట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. కందికల్‌లో ఉన్న ప్రభుత్వ భూమిపై ఇప్పటికే యాజమాన్య హక్కులపై కేసులు నడుస్తున్నాయని, పాత పిటిషన్ల గురించి చెప్పకుండా వెంకట్రామిరెడ్డి కోర్టును తప్పుదోవ పట్టించారని జీపీ తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది వాదనతో కోర్టు ఏకీభవించింది. కోర్టును తప్పుదోవ పట్టించడంతో పాటు, విలువైన సమయాన్ని వృథా చేసినందుకు రూ.కోటి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర హైకోర్టు చరిత్రలో పిటిషనర్ దారుకు ఇంతటి భారీ జరిమానా విధించడం ఇదే కావడంతో న్యాయవాద వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# పుతిన్‌కు ట్రంప్ ఫోన్

## ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై చర్చలు




**మహా:** రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు కృషి చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ఫోన్ చేశారు. సుమారు గంటలకుపైగా జరిగిన ఈ చర్చలు ముగిశాయని శ్వేతసౌధం, క్రెమ్లిన్ ధ్రువీకరించాయి. కానీ ఇరువురు నేతలు ఏం మాట్లాడారో మాత్రం వెల్లడించలేదు. పుతిన్‌తో తాను మాట్లాడదలుచుకున్న వివరాలను ట్రంప్ ముందుగానే వెల్లడించారు. పుతిన్‌తో తాను మాట్లాడతానని, భూమి, విద్యుత్కేంద్రాల గురించి, కొన్ని ఆస్తుల విభజనపైనా ఇరువురం చర్చిస్తామని ఆయన చెప్పారు. ఈ క్రమంలోనే పుతిన్‌కు ట్రంప్ ఫోన్ చేసి మాట్లాడారు. తాను అధికారంలోకి వస్తే రష్యాఉక్రెయిన్ యుద్ధం ముగిస్తానని ఎన్నికల ప్రచారంలో పదే పదే చెప్పిన డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఇప్పటికే ట్రంప్ ప్రతిపాదించిన 30 రోజుల కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంగీకరించారు. పుతిన్ దీనికి అంగీకారం తెలుపుతూనే, కొన్ని అంశాలపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందని అన్నారు. వాటిపై ట్రంప్‌తో మాట్లాడతానని పుతిన్ ఇంతకు ముందు చెప్పిన విషయం తెలిసిందే. తాజాగా ఆ చర్చలు కూడా ముగిశాయి.

04
# మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సంపాదకీయం | EDITORIAL | బుధవారం, హైదరాబాద్ | 19-03-2025
ann తెలుగు



# పరీక్షలకే పరీక్ష మన పరీక్షా విధానం!?





ఎన్.తిర్మల్, సీనియర్ జర్నలిస్టు
సెల్:9441864514,


మార్చి, ఏప్రిల్ నెలలు వచ్చాయంటే పరీక్షా కాలం వచ్చేసినట్లే! ఎస్ఎస్సీ,ఇంటర్, డిగ్రీ,పిజీ,మళ్ళీ వివిధ రకాల ప్రవేశపరీక్షల కాలం వెంట,వెంట వెంటనే పరుగెత్తుకొస్తుంది. పరీక్షలంటే ఒక రకమైన భయం,ఫోబియాకు విద్యార్థులు గురౌతుంటారు. పిల్లలతోపాటు తల్లిదండ్రులు ఎంతో కొంత టెన్షన్ ఫీలవుతుంటారు. అనాదిగా వస్తున్న పరీక్షా విధానం పై పలురకాల విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా ఏడాది కాలంగా విద్యార్థి నేర్చుకున్న జ్ఞానం కు గంట,మూడు గంటల్లో పరీక్షించడం సబబా? ఇది నిజంగా విద్యార్థి ఏడాదికాలంగా నేర్చుకున్న అభ్యసనానుభవాలను అంచనా వేయగలుగుతుందా? విద్యార్థి పరిపూర్ణ మూర్తిమత్వం ను ఈ పరీక్షలు ఎంత వరకు కొలమానం? అనేక ఏళ్ళుగా వస్తున్న మనపరీక్షా విధానం పైన పలు రకాల సందేహాలు మన విద్యారంగం మేధావులు, నిపుణులు వ్యక్తం చేస్తూ వచ్చారు. బ్రిటీష్ వలసవాదం నుండి వచ్చిన ఈ పరీక్షా విధానంమెకాలేకి నకలని, అశాస్త్రీయ మైనదని, సమూలంగా ఈ విదానం మారాలని,విద్యార్థులను వత్తిడికి గురిచేయని పరీక్ష విధానం కావాలని కోరుకున్నాము. అందులో భాగంగానే మన పరీక్షా విధానం లోని లోపభూయిష్టతను సరిదిద్ది పరీక్షా సంస్కరణలను తెచ్చుకున్నాం. విద్యాహక్కు చట్టం 2009 కొంతలో కొంతైనా మన అనుమానాలు నివృత్తి పరచగలిగింది. సరికొత్త పరీక్షా సంస్కరణ కు అవకాశం కల్పించింది. విద్యాహక్కుచట్టం2009 ,సెక్షన్29(1)హెచ్ ప్రకారం విద్యార్థి ఏడాదికాలంగా పొందిన అభ్యసనానుభవాలు,జ్ఞాన సామర్థ్యాలు, వత్తిడి లేకుండా పరీక్షించే పరీక్ష విధానం "నిరంతర సమగ్ర మూల్యాంకనం"(సి సి ఇ) మన నూతన ప్రక్రియ!ఈ పరీక్షా విధానం మౌలిక మార్పులు ఏమంటే నేర్చుకున్న దంతా గంట, మూడు గంటల్లో జవాబులు రూపంలో కక్కేసే కంటే. విద్యార్థి అభ్యసన అనుభవాలు తోపాటు,విద్యార్థి విద్యా సామర్థ్య అంచనా పరికరంపరీక్ష కూడా నిరంతర సమగ్ర ప్రక్రియగా ఉండాలి. అది ఏపాఠశాలలో ఏ విషయం లో నేర్చుకుంటున్నామో. ఆ ఉపాధ్యాయులు, ఆ అధ్యాపకులే ఎప్పటికప్పుడు నిరంతరం విద్యార్థిని అంచనా వేసుకుంటూ, విద్యార్థికి పరీక్ష నుండి గమనించిన అంశాలు నిరంతరం సమీక్షించి, సరిచేయడానికి సాధనంగా ఉండాలి. ఆ సాధనమే నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) విధానం అని విద్యాహక్కు చట్టం స్పష్టం చేసింది. దీని ప్రకారం నిర్మాణాత్మక మూల్యాంకనం (యఫ్ఏ),ఇది నాలుగు దశలుగా సబ్జెక్టును విభజించి, ఆ సబ్జెక్ట్ లో రాత సామర్థ్యం,పఠనసామర్థ్యం, ప్రాజెక్టు వర్క్(పని అనుభవం),స్లిప్ టెస్టు(జ్ఞాన అనుభవం) వీటన్నింటినీ తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో నిర్వహించబడి ఒక్కో అంశం కు 5మార్కులు చొప్పునసగటున 20మార్కుల ఏడాదిలో ఇవ్వబడతాయి. ఈనిర్మాణాత్మక పరీక్ష అనేది తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయుల వ్యక్తిగత బోధన సరిదిద్దడానికి, ఉపాధ్యాయులు తమ బోధనానుభవాలుసమీక్షకు,విద్యార్థి తాను వెనకబడిన విషయం తనకు తాను తెలుసుకోవడానికి తోడ్పడుతుంది.ఒకవిధంగా ఇవిమనం ఎంతోకాలంగా కోరుకున్న మార్పులే. ఇకపోతే సిసిఇలో రెండవ అంశం ఏమంటే సబ్జెక్టు రెండు భాగాలుగా విభజించిఒక్కోసెమిస్టర్ కు 40 మార్కులచొప్పున రెండు సెమిస్టర్ లు కుకలిపి 80 మార్కులకు విద్య నేర్చిన పాఠశాల లోనే సంగ్రాహనాత్మక మూల్యాంకనం జరుగుతుంది.ఈసంగ్రాహనాత్మక మూల్యాంకనంలో విద్యార్థి పొందినజ్ఞానం తోపాటు,ఆయా సబ్జక్టులలోని ఆరు అభ్యసన సామర్థ్యాలు పరీక్షించ బడతాయి. అంటే విద్యార్థి ఆ వయస్సులో పొందాల్సిన విద్యా సామర్థ్యాలు ఎంతోకొంత నిజాయితీగా అంచనా వేయగలిగిన విధానం. ఈ మొత్తం విద్యార్థి పొందిన 100మార్కులనుండి 3నుండి 10వరకు గ్రేడులను ఆయా విద్యార్థులకు పొందిన మార్కులను బట్టి ఇస్తారు. ఈ గ్రేడులే విద్యార్థి సమగ్ర మూల్యాంకనం అంచనా గా భావించి బోధనా లక్ష్యాలు విద్యార్థికి అందేలాముఖ్యంగాసబ్జక్టు ఉపయోగపడే అంశంపైనే ఈ పరీక్షలు!కానీ,మనం తరతరాలుగా వస్తున్న సాంప్రదాయ పరీక్షా విధానం అనే జాడ్యం నుండి బయట పడలేక విద్యార్థినే పరీక్షకు కేంద్ర బిందువుగా మార్చి, పరీక్షలను ఓప్రహసనంగా మార్చివేశాము.ఫలితంగా పాత పరీక్షా విధానం అనబడే వత్తిడి,ఫోబియా నుండి బయట పడలేక,వచ్చిన నూతన మార్పులను జీర్ణించుకోలేక,అమలు జరిపే దైర్యం లేక,అరకొర సంస్కరణలతోనే మన పరీక్షా విధానం సరిపెట్టుకుంటున్నాము. ఒక రకంగా చెప్పాలంటే నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ అనేది దేశవ్యాప్తంగా తొలిసారి వచ్చిన ఏకరూప పరీక్షా విధానం!విద్యార్థి,ఉపాధ్యాయులు చేతిలో నిరంతర సమగ్ర సాధనం అయిన ఈనిరంతర సమగ్ర మూల్యాంకనం విధానం వచ్చి15ఏళ్ళు గడిచినా నేటికీ దాన్ని సంపూర్ణంగా అమలు జరిపే దైర్యం తెగువ పాలకవర్గాలకు లేదు. ఇటు అర్థం చేసుకొని అనుసరించే స్థితికొందరు ఉపాధ్యాయులు, విద్యార్థులలో లోపించింది.పాత సాంప్రదాయిక పరీక్షా విధానం జాడ్యం "పిల్ల పోయినా పురిటి కంపు పోలేదన్న"సామెతను గుర్తు చేసేలా తయారైంది. విధానం మారినా మన ఆలోచనలు ఇంకా పాత పరీక్షా విధానం చుట్టే చక్కర్లు కొడుతున్నాయి.

విద్యాబాధ్యతలనుండి వైదొలగేలా మనం పెంచి పోషించు కున్న ప్రైవేటు విద్యా వ్యవస్థ మార్కుల విధానం తొలగించి గ్రేడుల విధానం తెచ్చినా పదికి పది పేరుతో తమ విద్యా వ్యాపార లక్ష్యాలు అమలు చేస్తూనే ఉన్నాయి.ఇప్పటికీ నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ జీర్ణం కాకపాత పరీక్షా విధానం తిరిగి ఏరూపంలో తేవాలనే ప్రయత్నాలు అన్ని స్థాయిల్లో కొనసాగుతున్నాయి.అందులో భాగమే కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టం ను దానికదే నిర్వీర్యం అయ్యే విధంగా,గీతాబుక్కల్ కమిటీ సిఫార్స్ పేరుతో,50ఏళ్ళనాడు మనం వదిలేసిన 'డిటేన్షన్' విధానం పునరుద్ధరణ వైపు అడుగులు వేస్తుంది.మన రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు విద్యా వ్యవస్థ వత్తిడి తట్టుకోలేక,మానెటరింగ్ వ్యవస్థ సరిదిద్దుకోలేక, ఇప్పటికే సంగ్రాహనాత్మక మూల్యాంకనం వార్షిక పరీక్షగా ,పాత వాసనలతో నిర్వహిస్తున్న 80మార్కులకు గాను,నిర్మాణాత్మక మూల్యాంకనం 20మార్కులు కలిపి పాత పద్దతిలో100మార్కులకు యస్ యస్ సీ పరీక్ష నిర్వహించభూనుకుంది.ఇది ఈఏడే అమలు పరచాలని అధికారులు ప్రయత్నించారు కూడా . కానీ కొన్ని సాంకేతిక సమస్యల వలన మరుసటి ఏడాదికి వాయిదా వేసుకున్నారు. అంతే కాకుండా మరో పరీక్ష మార్పుకు సైతం ఈఏడాది రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మార్చిలో పదవతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సరైన గ్రేడ్ రాని పక్షంలో మేనెలలోపు మరో ఇన్స్టెంట్ పరీక్ష నిర్వహించి ఒకే సారి ఫలితాలు ప్రకటిస్తామని ప్రకటించారు. అంటే పాత సప్లిమెంటరీ పరీక్షలు తిరిగి పునరుద్ధరణ అన్న మాట. అంటే ప్రైవేటు విద్యా వ్యవస్థ కోరికలు తూచా తప్పకుండా అమలు జరపడానికి అదికారులు, పాలకులు సంసిద్ధం అయ్యారనే విషయం సుస్పష్టం అవుతుంది. అభ్యసనానుభవాలు, పాఠ్యాంశాలు అధ్యయనంలో అంతర్లీనంగా అంతర్భాగంగా జరగాల్సిన నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ ) ప్రక్రియ మనపరీక్ష విధానంలో వత్తిడి లేని సులభతరం అయిన విధానాలకు సూచికనై ఉండగా, దాన్ని బలోపేతం చేయకపోగా ఎటు తిరిగీ మనపాత మూల్యాంకనం విధానం వైపు మన విద్యా అదికారుల ఆలోచనలు కొనసాగడంలో అంతర్యం ఏమిటో ఒకపట్టాన అర్థం కాదు?మనం చట్టంగా తెచ్చుకున్న సులభం, సరళతరం అయిన పరీక్ష సంస్కరణ వత్తిడి లేని నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియకు బదులు దొడ్డి దారిన తెస్తున్న పాత మూల్యాంకనం విధానం ఏరూపంలో తెచ్చినా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. మనం దీర్ఘ కాలిక పోరాటంతో విద్యాహక్కు చట్టంగా తెచ్చుకున్న నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ సంపూర్ణంగా అమలు చేయాలనే డిమాండ్ తో విద్యార్థులు, ఉపాధ్యాయులు,విద్యాబిమానులు ముందుకు పోవాలసిఉంది.వత్తిడి, విద్యార్థుల ఆత్మహత్యలు లేని సంపూర్ణ పరీక్షా సంస్కరణ అమలు దిశగా అడుగులు వేద్దాం. మనపాఠశాల పరీక్షా వ్యవస్థ లోసరైన మార్పులను మాత్రమే స్వాగతిద్దాం.భవిష్యత్ తరాలకోసం అదిమన బాధ్యత కూడానూ!?

> మార్చి, ఏప్రిల్ నెలలు వచ్చాయంటే పరీక్షాకాలం వచ్చేసినట్లే! ఎస్ఎస్సీ,ఇంటర్, డిగ్రీ,పిజీ,మళ్ళీ వివిధ రకాల ప్రవేశపరీక్షల కాలం వెంట,వెంట వెంటనే పరుగెత్తుకొస్తుంది. పరీక్షలంటే ఒకరకమైన భయం,ఫోబియాకు విద్యార్థులు గురవుతుంటారు.

> మనం తరతరాలుగా వస్తున్న సాంప్రదాయ పరీక్షా విధానం అనే జాడ్యం నుండి బయటపడలేక విద్యార్థినే పరీక్షకు కేంద్ర బిందువుగా మార్చి, పరీక్షలను ఓప్రహసనంగా మార్చివేశాము. ఫలితంగా పాత పరీక్షా విధానం అనబడే వత్తిడి,ఫోబియా నుండి బయట పడలేక,వచ్చిన నూతన మార్పులను జీర్ణించుకోలేక,అమలు జరిపే దైర్యం లేక, అరకొర సంస్కరణల తోనే మన పరీక్షా విధానం సరిపెట్టుకుంటున్నాము. ఒక రకంగా చెప్పాలంటే నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ అనేది దేశవ్యాప్తంగా తొలిసారి వచ్చిన ఏకరూప పరీక్షా విధానం!

> విద్యార్థి,ఉపాధ్యాయులు చేతిలో నిరంతర సమగ్ర సాధనం అయిన ఈనిరంతర సమగ్ర మూల్యాంకనం విధానం వచ్చి15ఏళ్ళు గడిచినా నేటికీ దాన్ని సంపూర్ణంగా అమలు జరిపే దైర్యం తెగువ పాలకవర్గాలకు లేదు.

> మనం చట్టంగా తెచ్చుకున్న సులభం, సరళతరం అయిన పరీక్ష సంస్కరణ వత్తిడి లేని నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియకు బదులు దొడ్డి దారిన తెస్తున్న పాత మూల్యాంకనం విధానం ఏరూపంలో తెచ్చినా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. మనం దీర్ఘ కాలిక పోరాటంతో విద్యాహక్కు చట్టంగా తెచ్చుకున్న నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ సంపూర్ణంగా అమలు చేయాలనే డిమాండ్ తో విద్యార్థులు, ఉపాధ్యాయులు,విద్యాబిమానులు ముందుకు పోవాలి.


## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999


# సీఎం రేవంత్-భట్టి అనుబంధం



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లాల్సిన రోజు. మీడియా వాహనాలు ఒకదాని వెనుక ఒకటి నిలబడిపోయాయి. రేవంత్ రెడ్డి కాన్వాయ్ ముందుకు కదులుతుండగా, పక్కనే మల్లు భట్టి విక్రమార్క కారు కూడా వెళ్తోంది. ఇద్దరూ కలిసి ఒకే విమానంలో ప్రయాణించబోతున్నారు. ఇది కొత్త విషయం కాదు. గత కొన్ని నెలలుగా ఎక్కడికి వెళ్లినా రేవంత్ పక్కన భట్టి కనిపిస్తున్నారు. ప్రయాణానికి ముందు మీడియా ప్రతినిధులు ఎప్పటిలాగే ప్రశ్నలు వర్షం కురిపించారు. "సర్, మీరు ముఖ్యమంత్రి... కానీ భట్టి విక్రమార్క గారు ఎల్లప్పుడూ మీ వెంటనే ఉంటున్నారు. ఆయనను మీరు పూర్తిగా నమ్మేసారా?" రేవంత్ కాస్త చిరునవ్వు చిందించి సమాధానం ఇచ్చాడు. "భట్టి గారు నా మద్దతు కాదు, నా చేతి వేళ్లు. వేదిక ఎక్కడైనా ఉండొచ్చు, కానీ నాయకత్వానికి ఓ భరోసా ఉండాలి. భట్టి గారు నాకు ఆ భరోసా." ఆ మాట వినగానే భట్టి విక్రమార్క ముక్కుసూటిగా సమాధానం ఇచ్చాడు. "రేవంత్ గారు సీఎం అవ్వడం కాంగ్రెస్ పార్టీ విజయం. ఈ విజయాన్ని నిలబెట్టాలి. నా బాధ్యత అదే." అన్నారు. మల్లు భట్టి విక్రమార్క గురించి ఒక ప్రత్యేకత ఉంది. ఆయన ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉంటారు. అనుభవంతో మచ్చలేని నాయకుడిగా ఎదిగిన వ్యక్తి. కానీ ఇప్పుడు ఆయన రేవంత్ రెడ్డికి కుడిచేయిగా మారిపోయారు. కాంగ్రెస్‌లో ఉన్న అనేక మంది సీనియర్ నేతలకు ఇదే ఊహించని పరిణామం. కర్ణాటకలోసీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య విభేదాలు రోజుకో మలుపు తిరుగుతుంటే, తెలంగాణలో మాత్రం రేవంత్‌భట్టి మధ్య అలాంటి చీలిక ఎక్కడా కనిపించలేదు. నిజానికి, భట్టి విక్రమార్క ఉండటం వల్లే రేవంత్ మరింత ధైర్యంగా వ్యవహరిస్తున్నారనే మాట వినిపిస్తోంది. ఒక్కసారి శాసనసభ సమావేశాలను తలచుకుంటే స్పష్టంగా తెలుస్తుంది. ప్రతిపక్ష నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతిసారి భట్టి విక్రమార్క సిద్ధంగా ఉంటారు. ప్రతీకార ధోరణి కాదు, కానీ ప్రశ్నలకు సమాధానం ఉండేలా వ్యవహారశైలి. ఇది ప్రభుత్వానికి ఒక రక్షణ కవచంగా మారింది. "మీరు పాత ప్రభుత్వం నుంచి బడ్జెట్ తక్కువగా తీసుకున్నారు. అభివృద్ధి ఎలా చేయగలరు?" అని ఓ ప్రతిపక్ష నేత అడిగినప్పుడు, భట్టి విక్రమార్క ఆగకుండా సమాధానం ఇచ్చారు. "తెలంగాణ ఖజానాలో డబ్బు లేదు అనేది ఓ మిథ్య. కొత్త ప్రణాళికలు తెచ్చాం. ప్రజలకు మేలు చేసేలా ప్రతి రూపాయి ఖర్చు పెడతాం." అసెంబ్లీలో విపక్షానికి ఎదురొడ్డి నిలిచే నాయకుడు కావాలంటే అది భట్టి విక్రమార్కలా ఉండాలి. ఆయన స్ట్రాటజీకి రేవంత్ కూడా ముగ్ధుడయ్యారు. తెలంగాణ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే, ఒక ముఖ్యమంత్రి-ఉప ముఖ్యమంత్రి మధ్య ఇంతటి బలమైన కెమిస్ట్రీ కనిపించడం అరుదు. ఇది కాంగ్రెస్ పార్టీకి ఒక ప్లస్ పాయింట్. ఒక రోజు ఓ సన్నిహితుడు భట్టి విక్రమార్కను ప్రశ్నించాడు, "ఇంత బలమైన రాజకీయ అనుబంధం ఎప్పటికీ నిలుస్తుందా?" భట్టి విక్రమార్క సూటిగా సమాధానం ఇచ్చాడు. "రాజకీయాల్లో శాశ్వతమేమీ లేదు. కానీ జట్టు కుదిరితే, గెలుపు దూరంగా ఉండదు."

(గడల నరసింహారావు, సీనియర్ జర్నలిస్ట్, ఖమ్మం.)

# విందోదయం
## బ్రేక్ ఫాస్ట్‌లకు కేరాఫ్ ఈ టిఫిన్ సెంటర్లు..!



మంచి ఫుడ్ ఎంజాయ్ చేయడానికి ఇంటిల్లి పాదీ కలిసి పేరున్న రెస్టారెంట్ /కేఫ్‌లకు లంచ్, డిన్నర్‌లకో వెళ్లడం తెలిసిందే. అయితే ప్రస్తుతం బ్రేక్ ఫాస్ట్ సమయం కూడా సిటిజనుల మీట్ అండ్ ఈట్‌లకు కేరాఫ్‌గా మారింది. లేట్‌నైట్స్‌లోనే బ్రేక్‌ఫాస్ట్ చేసే ప్లేసెస్ గురించి మాట్లాడుకుని ఉదయమే అక్కడ ప్రత్యక్షం అవుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సిటీజనులు తమ బ్రేక్ ఫాస్ట్, అల్పాహారం కోసం తరచూ ఎంచుకునే వాటిలో ఇవీ..

**టేస్టీ ఫుడ్**

ఆస్వాదించి సంతృప్తిగా రోజును ప్రారంభించడం కన్నా మంచి రోజు ఏముంది? అద్భుతమైన వంటల వారసత్వానికి ప్రసిద్ధి చెందిన మన నగరం, రుచికరంగా రోజును కిక్‌స్టార్ట్ చేయడానికి అనేక ఎంపికలను అందిస్తుంది. దోసెలు, ఇడ్లీల వంటి సంప్రదాయ దక్షిణ భారతీయ ఇష్టమైన వాటి నుంచి ఆమ్లెట్లు, వాఫ్ఫల్స్ వంటి అంతర్జాతీయ వెరైటీల వరకు మన సిటీలోని అల్పాహార సమయం.. వైవిధ్యంగా ఉంటుంది. రుచులు అనుభవాల విందోదయాల కోసం అందుబాటులో కొన్ని.. కోఠిలోని సందడిగా ఉండే వీధుల్లో ఉన్న ప్రగతి టిఫిన్ సెంటర్ దక్షిణ భారత అల్పాహార ప్రియుల సందడితో నిండి ఉంటుంది. క్రిస్పీ దోసెలు, మెత్తటి ఇడ్లీలు, ఊతప్పమ్‌లకు ఈ సెంటర్ ప్రసిద్ధి చెందింది. ఇక్కడ హైలైట్ ఏమిటంటే ప్రతి వంటకంతో పాటు అందించే చట్నీలు. ఉదయం 7గంటల నుంచి 9 గంటలలోపు హనుమాన్ టేక్డి, హెచ్‌వీఎస్ రోడ్‌లో ఉన్న ఈ సెంటర్‌ను సందర్శించం అంటే నోరూరించే దక్షిణాది వంటకాలను ఆస్వాదించినట్లే..

సంప్రదాయ రుచులను కోరుకునే వారు గచ్చిబౌలిలోని ఇందిరానగర్‌లో ఉన్న ఉడిపి ఉపహార్‌కు చలో అంటున్నారు. ఇడ్లీలు, వడలు, దోసెలు, ఊతప్పమ్ వంటి అనేక రకాల దక్షిణ భారతీయ ప్రధాన వంటకాలను అందిస్తుంది. మెనూలో డబుల్ కా మీఠా, బొబ్బట్టు వంటి స్వీట్ ట్రీట్‌లు కూడా ఉన్నాయి. ఇది ఇక్కడ అల్పాహారం ఉదయం 7 నుంచి 10.30గంటల మధ్య అందుబాటులో ఉంటుంది. మాదాపూర్‌లోని హమ్మింగ్ బర్డ్ కేఫ్‌లో కేఫ్ స్టైలి ఆరోగ్యకరమైన అల్పాహారం కోరుకునే సిటిజనులు ఎంచుకుంటున్నారు. ఇక్కడ మష్రూమ్ ఆమ్లెట్‌ల నుంచి బ్రోకలీ చీజ్ ఆమ్లెట్‌ల వరకు రోజంతా అల్పాహారం అందించడం విశేషం. ఆహారం పోషకాలతో నిండిన సూప్‌లు, సలాడ్‌లతో పాటు కాఫీలూ ఎంజాయ్ చేయవచ్చు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 11.30 దాకా అందుబాటులో ఉంటుంది. పిజ్జాదోస, పాస్తా దోస, మంచూరియా దోస వంటి వెరైటీ ఆధునిక దక్షిణ భారత బ్రేక్‌ఫాస్ట్‌లను కోరుకునేవారు బంజారాహిల్స్‌లోని రాయల్ టిఫిన్ సెంటర్‌ను ఎంచుకుంటున్నారు. వీరి మెనూలో ఉప్మా ఊతప్పమ్‌ల వంటి క్లాసిక్స్ కూడా ఉన్నాయి.

# కులగణన చేసిన ఘనత కాంగ్రెస్‌దే

## బీసీలు విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో రాణించేలా పెద్దపీట

- బడుగు, బలహీన వర్గాల సాధికారతే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం రాజీవ్ యువ వికాసం పథకంతో యువతకు ఉపాధి అవకాశాలు
- ఆదిలాబాద్‌లో భూమాఫియాకు అడ్డుకట్ట వేస్తామని హెచ్చరిక
- రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ వ్యవహారంలో పాయల శంకర్, జోగు రామన్న ఇద్దరి తీరు ఒకటే డబ్బులు దండుకోవడమే నైజం
- ప్రెస్ మీట్ లో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి



**ఆదిలాబాద్, మహా :** దేశంలో ఏ రాష్ట్రం చేపట్టని విధంగా ప్రతిష్టాత్మకంగా కులగణన చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగం, రాజకీయాలలో 42 శాతం రిజర్వేషన్ కల్పించి వారికి పెద్దపీట వేసిందన్నారు. అటు రాజీవ్ యువ వికాసంతో యువతకు ఎంతో మేలు చేకూరుతుందని, 50 వేల నుండి 5 లక్షల వరకు ఆర్థికసాయం అందుతుందని తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో కులగణన జరిగిందన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించాలనే సంకల్పంతో, మంచి ఆలోచన దృక్పథంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముందుకుసాగుతోందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో వారు రాణించేలా విశేష కృషి చేస్తోందన్నారు. బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మానాలు చేయడం ముమ్మాటికీ రాజ్యాంగాన్ని పరిరక్షించడమేనని అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి వారి ఆకాంక్షలకు అనుగుణంగా తగు చర్యలు చేపట్టడం సాహసోపేతమన్నారు. అదేవిధంగా ఎస్సీ, బీసీలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలు అభినందనీయమని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం యావత్ తెలంగాణ గర్వపడేలా చేసిందని, బీసీల ఆత్మగౌరవాన్ని చాటిందన్నారు. ఇప్పుడు దేశమంతా తెలంగాణ వైపు చూస్తోందన్నారు. పల్లెలు, పట్టణాలలో సంబరాలు జరగాలని, ఈ ఘనమైన వేడుకల్లో ప్రతిఒక్కరూ పాల్గొనేలా చూడాలని కాంగ్రెస్ శ్రేణులకు కంది శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలనే ఆకాంక్షతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. యువత ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలన్నదే తన ధ్యేయమన్నారు. ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కృషి చేస్తామని సీయం అసెంబ్లీ లో ప్రకటించడం గర్వకారణమన్నారు. అందరూ కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తే అందరికీ సమవాటా దక్కుతుందని, ప్రజలు అభివృద్ధి చెందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇప్పటికే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాని స్పష్టం చేశారు. పదేండ్లలో గత బీఆర్ఎస్ సర్కార్ చేసిన ఆరు లక్షల కోట్ల అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం మిత్తి చెల్లిస్తోందన్నారు. ఇటు ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే భూముల కబ్జాలపర్వం కొనసాగుతోందన్నారు. త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ భూకబ్జాలను ఆధారాలతో సహా బయట పెడతానన్నారు.అటు రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ వ్యవహారంలోనూ పాయల శంకర్, జోగు రామన్నల తీరు ఒకటేనన్నారు. డబ్బులు దండుకోవడమే నైజం అని విమర్శించారు. ఇద్దరు కలిసి మళ్లీ ఆదిలాబాద్ ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. వారి కుట్రలను ఇక సాగనివ్వబోమని తేల్చి చెప్పారు.సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీని తెరిపించడంలో ఎంపీ, ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. వారిని గెలిపించిన పాపానికి ప్రజలు బాధలు పడుతున్నారన్నారు. ప్రజలందరి ఆశీర్వాదంతో జిల్లాలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. పేదవారి ముఖాల్లో చిరునవ్వులు చూడాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమం లో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్,మావల ఎంపీపీ దర్శనాల ఏవన్,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్,బండారి సతీష్,సంద నర్సింగ్,ఆవుల వెంకన్న, యెల్మెల్వార్ రామ్ కుమార్,జాఫర్ అహ్మద్, మున్సిపల్ కో.ఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్ కుమార్,ఎస్.సి వింగ్ ఆదిలాబాద్ అసెంబ్లీ సెక్రటరీ పవర్ వసంత్,ఎస్. సి వింగ్ టౌన్ జనరల్ సెక్రటరీ జబాడే సాహెబ్రావు,నాయకులు దొగ్గలి రాజేశ్వర్, దాసరి ఆశన్న,మునిగేల విట్టల్,కొండూరి రవి, మానే శంకర్, మొహమ్మద్ రఫీక్,ఎం.ఏ కయ్యూమ్,తమ్మల చందు, దీపక్ రావు, శ్రీరామ్,సంతోష్,భీమనవేణి రాములు యాదవ్, రాహుల్, భీమనవేణి రవీందర్ యాదవ్,యాల్ల పోతా రెడ్డి, అంబదాస్, టెలి వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేయాలి

## మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

- దేశంలో ముప్పై ఏళ్ల ఏకైక సామాజిక ఉద్యమం ఎమ్మార్పీఎస్
- ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ



**రంగారెడ్డి జిల్లా, మహా :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు జాబ్ క్యాలెండర్ ప్రకారం భర్తీ చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగాలన్ని ఎస్సీ వర్గీకరణ ప్రకారమే నియామకాలు చేయాలని బిఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ పద్మ నర్సింహా ముదిరాజు అన్నారు. రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో గత ఎనిమిది రోజులుగా జరుగుతున్న నిరాహార దీక్షకు మాజీ జడ్పీటీసీ పద్మ నర్సింహా ముదిరాజు సంఘీభావం తెలిపి, ఎనిమిదవ రోజు దీక్షను ప్రారంభించారు. మెదక్‌పల్లి చంద్రధన, మాదయపల్లి గ్రామాలకు చెందిన, మండల అధ్యక్షులు తుడుం శ్రీను మాదిగ, చంద్రధన మాజీ ఉప్ప సర్పంచ్ సొల్లు సుధాకర్ మాదిగ, మండల ఉపాధ్యక్షులు ముదిగొండ సంజీవ మాదిగ, మెదక్‌పల్లి గ్రామ అధ్యక్షులు ధర్వుల గోపాల్ మాదిగ, డి వెంకటేష్ మాదిగ, ముదిగొండ ఎల్లయ్య మాదిగ నిరాహార దీక్షలో కూర్చోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ జరిగితే మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఎస్సీ రిజర్వుడు కేటగిరిలోని ఉద్యోగాలన్ని ఏక పక్షంగా మరో సామాజిక వర్గానికి చెందే అవకాశం ఉందని అన్నారు. ముప్పై ఏళ్ల పోరాటంలో ఉన్న న్యాయాన్ని సుప్రీం కోర్టు గుర్తించి తీర్పు చెప్పిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మాదిగలకు తగిన న్యాయం చేసే విధంగా ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యా ఉద్యోగ రంగాల్లో న్యాయం చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత అని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ముప్పై ఏళ్లుగా శాంతియుతంగా నడుస్తున్న పోరాటం ఒక్క ఎమ్మార్పీఎస్ మాత్రమే అని, ప్రస్తుతం ఈ పోరాటం విజయానికి చేరువైందని అన్నారు. మంద కృష్ణ మాదిగ లేకుంటే ఎస్సీ వర్గీకరణ ఉద్యమం లేదని అన్నారు. కనుక ఎస్సీ వర్గీకరణ ఫలితం మంద కృష్ణ మాదిగకే చెందుతుందని అన్నారు. కేవలం మాదిగల కోసమే కాకుండా, ఎస్సీ కులాలకు న్యాయం జరగాలనే సదుద్దేశంతో వర్గీకరణ పోరాటం జరిగిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చేంత వరకు తమ ఉద్యమ ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు పోతుగంటి కుమార్ మాదిగ, తలకొండపల్లి మాజీ వార్డు మెంబర్ పెరుమాండ్ల నర్సింహా మాదిగ, తూర్పు శ్రీను మాదిగ, సొల్లు రాజు మాదిగ, పేరుమాండ్ల శేశికాంత్, పోతుగంటి మహేష్ మాదిగ, కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# టీబీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

## వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలి



జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, మహా:** టీబీ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానం ఉన్న వారంతా టీబీ పరీక్ష చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మెట్రోసెమ్ సంస్థ ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం మొహతాజ్ ఖానాలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే టీబీని గుర్తించి మందులు వాడితే సులభంగా నయమవుతుందని అన్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రిలోనూ టీబీ పరీక్ష అందుబాటులో ఉందని తెలిపారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి టీబీ తొందరగా వ్యాపిస్తుందని, అందువల్ల సమతుల పోషకాహారం తీసుకోవాలని సూచించారు. టీబీ వ్యాధి పరీక్షలకు ప్రైవేట్ ఆసుపత్రిలో రూ. 15 వేల వరకు ఖర్చు అవుతుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పరీక్ష ఉచితంగా చేయడంతో పాటు మందులు అందిస్తారని తెలిపారు. ప్రభుత్వం తరఫున ప్రతి నెలా టీబీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న రూ.1000 పోషకాహారానికి వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమ అమలు గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ రిజిస్టరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, టీబి ప్రోగ్రామ్ ఆఫీసర్ రవీందర్, ఇమినైజేషన్ ఆఫీసర్ సాజిద, పాల్గొన్నారు.

### స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు

# అహంకారానికి నిదర్శనం

- తీవ్రంగా ఖండిస్తూ జగదీశ్వర్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం
- వారిద్దరి తీరుపై భగ్గుమన్న అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి
- కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి క్యాంపు కార్యాలయం వద్ద నిరసన



**ఆదిలాబాద్, మహా :** అసెంబ్లీలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను బీఆర్ఎస్ నేతలు అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని, వారి అహంకారానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాల సాక్షిగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఇటీవల మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వారి ఫ్లెక్సీని దహనం చేశారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నిరసన నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ...దళితులకు రేవంత్‌రెడ్డి సర్కార్ పెద్దపీట వేసి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌ను స్పీకర్‌ను చేస్తే బీఆర్ఎస్ దురంహకారంగా వ్యవహరిస్తోందన్నారు. ఆ పార్టీ నేతలు ఆయనను అవమానించేలా... స్పీకర్ అన్న కనీస గౌరవం లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. ఈ చర్యను యావత్ ఆదిలాబాద్ ప్రజానీకం తరపున, కాంగ్రెస్ పార్టీ తరపున ముక్తకంఠంతో ఖండిస్తున్నామని చెప్పారు. చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బేషరతుగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్,మావల ఎంపీపీ దర్శనాల ఏవన్,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్,బండారి సతీష్,సంద నర్సింగ్,ఆవుల వెంకన్న, యెల్మెల్వార్ రామ్ కుమార్,జాఫర్ అహ్మద్,మున్సిపల్ కో.ఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్ కుమార్,ఎస్.సి వింగ్ ఆదిలాబాద్ అసెంబ్లీ సెక్రటరీ పవర్ వసంత్,ఎస్. సి వింగ్ టౌన్ జనరల్ సెక్రటరీ జబాడే సాహెబ్రావు,నాయకులు దొగ్గలి రాజేశ్వర్, దాసరి ఆశన్న,మునిగేల విట్టల్,కొండూరి రవి, మానే శంకర్, మొహమ్మద్ రఫీక్,ఎం.ఏ కయ్యూమ్,తమ్మల చందు, దీపక్ రావు, శ్రీరామ్, సంతోష్,భీమనవేణి రాములు యాదవ్,రాహుల్, భీమనవేణి రవీందర్ యాదవ్,యాల్ల పోతా రెడ్డి, అంబదాస్, టెలి వసంత్ తదితరులు పాల్గొన్నారు.



### అభ్యసన ఫలితాలు సాధించేలా

# బోధన చేయాలి

**ములుగు, మహా :** విద్యార్థులు అభ్యసనా ఫలితాలు సాధించేలా బోధన జరగాలని ఎస్సీఈఆర్టీ ఫ్యాకల్టీ సభ్యుడు డాక్టర్ ఎస్ఎం.అహ్మద్ సూచించారు. మంగళవారం ములుగు, మల్లంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైమరీ స్కూల్, బండారుపల్లి, జవహర్నగర్ మోడల్ స్కూళ్లను సందర్శించిన ఆయన విద్యార్థుల అభ్యసనా స్థాయిలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులందరూ లర్నింగ్ అవుట్ కమ్స్ సాధించేలా ప్రణాళికా బద్ధంగా బోధించాలని, అభ్యసన ప్రక్రియలో టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ ఉపయోగించాలని సూచించారు. పాఠశాల లైబ్రరీ, ఇటీవల ప్రారంభించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించారు. ఉపాధ్యాయులందరూ రోల్ మోడల్ గా ఉండేలా పనిచేయాలని కోరారు. పదవతరగతి విద్యార్థులు ప్రతీ పాఠ్యాంశంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలి

- డీఎంహెచ్వో డాక్టర్ గోపాల్ రావు..జగ్గన్నపేట గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ





**ములుగు, మహా :** విద్యార్థుల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యసిబ్బందికి డీఎంహెచ్వో డాక్టర్ ఎన్.గోపాల్ రావు సూచించారు. ములుగు మండలం రాయిని గూడెం పీహెచ్‌సీ పరిధిలోని జగ్గన్నపేట గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించి వంటశాల, భోజనం, స్టోర్ రూంలను పరిశీలించారు. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. అనంతరం పత్తిపల్లి ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్ ను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్వో మాట్లాడుతూ.. వేసవికాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటున్నాయని, బయట తిరగొద్దన్నారు. వడదెబ్బ తగిలితే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలన్నారు. విద్యార్థులకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని సూచించారు. మానసిక ధైర్యాన్ని పెంపొందించుకోవాలని, పరీక్షలకు భయపడకూడదని తెలుపుతూ, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని విద్యార్థులకు వివరించారు. వైద్యసిబ్బందితో మాట్లాడుతూ గ్రామాలలో పనిచేస్తున్న ఉపాధిహామీ పథకాల ప్రాంతాలను గుర్తించి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, ఉదయం 11గంటలలోపే వ్యవసాయ పనులకు పోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్బిఐ ఎస్కె టీం డాక్టర్ శ్రీలత, డాక్టర్ మల్లికార్జున్, ఆరోగ్య కార్యకర్త ఉపేంద్ర, తిరుపతమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### సీపి ని కలసిన

# ఏసీబీ అధికారులు



**హన్మకొండ, మహా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ కు నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సన్ ప్రీత్ సింగ్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా ఏసీబీ అధికారులు డిఎస్పీ సాంబయ్య తోపాటు ఇన్‌స్పెక్టర్లు ఎస్.రాజు, ఎల్.రాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ పలు కీలక అంశాల పై ఏసీబీ అధికారులతో ముచ్చటించారు.

# సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం : కంది శ్రీనివాసరెడ్డి

## బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం

## ప్రజాసేవా భవన్ వద్ద సీఎం, మంత్రుల ఫ్లెక్సీలకు పాలాభిషేకం



**ఆదిలాబాద్, మహా:** సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం సాహసోపేత, చారిత్రాత్మక నిర్ణయాలతో ప్రజల మెప్పుపొందుతోందని, మరింత చేరువవుతోందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. బీసీల రిజర్వేషన్ 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం శుభ పరిణామమని, హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలపడం, దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపడంపై హర్షం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క ఫ్లెక్సీలకు క్యాంపు కార్యాలయం, ప్రజాసేవా భవన్ వద్ద పాలాభిషేకం చేసి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ....ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి, ప్రభుత్వానికి ఎల్లవేళలా అండగా ఉంటామని, తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.ఆదిలాబాద్ జిల్లా ప్రజల తరపున ప్రభుత్వానికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బడుగు, బలహీనవర్గాలవర్గాల సాధికారత పెంపొందించే చర్యలు అని అన్నారు. రాజీవ్ యువ వికాసం కింద యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు స్వయం సంవృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని అన్నారు.

### నిరుద్యోగ యువతకు

# రాజీవ్ యువ వికాసం పథకం

- యువ వికాసంతో యువతి యువకులకు ఉపాధి
- రేవంత్ సర్కార్ నిరుద్యోగాన్ని రూపుమాపుతుంది
- యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు షాబుద్దిన్



**రంగారెడ్డి జిల్లా, మహా :** నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పన కొరకు, రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగ్యాన్ని రూపుమాపుతుందని షాబుద్దీన్ అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అర్హులైన అన్ని వర్గాల నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి పొందడం జరుగుతుందని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన లబ్ధిదారులకు లక్ష రూపాయలు నుండి 4 లక్షల రూపాయల వరకు రుణం పొందవచ్చన్నారు. గత ప్రభుత్వంలో పది సంవత్సరాలుగా ఏ ఒక్క వర్గానికి మేలు చేయలేదని విమర్శించారు. అదేవిధంగా నిరుద్యోగుల శాతం భారీగా పెరిగిందన్నారు. ఇంటిలో ఒక్క ఉద్యోగమని చెప్పి విద్యార్థులందర్ని మోసం చేశారన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ లక్షల ఉద్యోగాలు అని చెప్పి గద్దనెక్కి తన కుటుంబంలో కేటీఆర్, హరీష్ రావు, కవిత మరియు సంతోష్ రావులకు నాలుగు ఉద్యోగాలు తెచ్చుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలోనే దాదాపు 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో నిరుద్యోగ యువతి యువకులలో వెలుగులు నింపడానికి రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ద్వారా అన్ని వర్గాల నిరుద్యోగులకు అనేక విధాలుగా మేలు జరుగుతుందని, నిరుద్యోగుల శాతం కూడా తగ్గుతుందన్నారు. ప్రస్తుత తేదీ నుండి ఏప్రిల్ 5 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజా సంక్షేమ పాలన నడుస్తుందని అన్నారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, మండల అధ్యక్షులు బోసు రవి, టౌన్ అధ్యక్షులు భానుకిరణ్, నాయకులు ఎర్రోళ్ల శ్రీకాంత్, సాయి గౌడ్, గంట నరేష్, ఆకాశ్ గౌడ్, రమేష్ నాయక్, మొగిళ్ళ మహేష్, తులసిరాం, శ్రీకాంత్ రెడ్డి, కర్రోల్ల రమేష్, గురిగల్ల రామకృష్ణ, శ్రీకాంత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, మహా :** ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లాస్థాయిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పురోగతి పై అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 41422 దరఖాస్తులు రాగా అందులో 14,899 క్రమబద్దీకరణకు మంజూరు చేయడం జరిగిందని, ఫీజు చెల్లించిన 665 మందికి క్రమబద్దీకరణ పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. ఎల్ ఆర్ ఎస్ కొరకు 26 ఆగస్టు 2020 కు ముందు దరఖాస్తు చేసుకొన్న వారు ప్రభుత్వం కల్పించిన సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మార్చి 31లోగా 25 శాతం రిబెట్ తో ఫీజులు చెల్లించేలా ప్రోత్సహించాలని అన్నారు. అవసరమైన చోట అదనపు లాగిన్ల ద్వారా అధికారులుసమన్వయంతోఎల్ఆర్ఎస్దరఖాస్తులపరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, డిపిఓ కల్పన, నర్సంపేట , వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్లు ,పట్టణ ప్రణాళిక, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పార్క్ స్థలం కబ్జా అవుతుంది కాపాడండి

## ఎల్బీ నగర్ జోనల్ కమీషనర్ కు కాలనీ వాసుల ఫిర్యాదు

**ఎల్బీనగర్, మహా:** కాలనీ పార్క్ స్థలం కబ్జా చేసి నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ కు హయత్ నగర్ లోని శివగంగా కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.పక్క లే అవుట్ లో 211 గజాల ప్లాట్ ఓనర్ తమ కాలనీ లే అవుట్ లోని 153గజాల పార్క్ స్థలం కబ్జా చేసి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. తమ కాలనీ పార్క్ స్థలాన్ని కాపాడాలని జడ్ సినీ కోరడంతో దానిపై జోనల్ కమీషనర్ విచారణ ప్రారంభించారు.

# చదువుకోవడానికి భయపడనవసరం లేదు

- ప్రతి ఒక్కరికి విద్యార్థి దశ కీలకం
- విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్







**ములుగు, మహా :** విద్యార్థులు చదువుకోవడానికి భయపడొద్దని, ఇష్టంతో కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం ఏటూరునాగారం మండలంలో పర్యటించిన కలెక్టర్ ఆకులవారి ఘనపురంలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులకు అందిస్తున్న భోజనశాల, వంటగదిని, సరుకుల స్టోరేజీ గదిని తనిఖీ చేశారు. సరుకులను వాటి బ్రాండ్ ను, నాణ్యతను, గడువు తేదీని పరిశీలించారు. వంట గదిలో శుభ్రత పాటించాలని, పరిశుభ్రత, నాణ్యతతో భోజనం తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూ ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నిర్దేశించిన కంపెనీలకు చెందిన స్టాక్ ను మాత్రమే వినియోగించాలని తెలిపారు. భోజనం రుచి, నాణ్యతను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఏ సమయానికి ఏయే ఆహారం ఇస్తున్నారని విద్యార్థులను అడిగారు. కామన్ డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు అన్ని రకాల పోషకాహారంతో కూడిన ఆహారాన్ని అందజేస్తున్నారని తెలిపారు. వివిధ రకాల విటమిన్ల, ప్రోటీన్లతో కూడిన ఈ ఆహారాన్ని కచ్చితంగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి సుఖ జీవితం పొందాలంటే విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ప్రతిరోజు నాలుగైదు గంటలు చదువుపై శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతి విద్యార్థి సమయాన్ని వృధా చేయకుండా విద్యను అభ్యసించాలని, తెలియని విషయాలను ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకోవాలని అన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించడానికి నూతన విద్యా బోధన విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

**అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్**

యువత విద్యారంగంలో తమ ప్రతిభను కనబరిస్తే అన్ని రంగాల్లో రాణించవచ్చని, వచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటి ఐ కళాశాలలో అగ్నిపత్ 2025 26 సంవత్సరంలో భారత సైన్యంలో చేయడానికి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన సదస్సు కు ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ యువత తమలోని ప్రతిభ కనపరిస్తే మన దేశంలోనే కాకుండా ఇతర దేశాలలో సైతం ఉద్యోగాలు పొందే అవకాశాలు వస్తాయని, యువత ఏదో ఒక రంగంలో విద్యను అభ్యసించడానికి చొరవ చూపాలని సూచించారు. భారత సైన్యంలో చేరడానికి ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సైతం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి ఒక్కరు కష్టపడితేనే అన్ని ఫలాలను పొందుతారని అన్నారు. భారత సైన్యంలో చేరడానికి అవిహహేత యువతకు ముందుకు రావడం శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు.

## పన్ను చెల్లించని జయ నర్సింగ్ కళాశాల




**వరంగల్, మహా :** గత మూడేళ్ళ గా మున్సిపల్ కార్పొరేషన్ కు బకాయి పడి ఉన్న ఆస్తి పన్ను రూ. 44 లక్షలు చెల్లించని కారణం గా కమిషనర్ ఆదేశాల మేరకు హన్మకొండ లోని జయ నర్సింగ్ కాలేజీని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భం గా డిప్యూటీ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ జయ నర్సింగ్ కళాశాల యాజమాన్యం కోర్టులో కేసు కొనసాగుతుందని చెబుతూనే నర్సింగ్ కళాశాలను నడుపుతున్నారని గుర్తించిన బల్దియా పన్నుల అధికారులు బకాయి పడి ఉన్న పన్నులు చెల్లించాలని కోరుతూ రెడ్ నోటీస్ జారీ చేయడం జరిగిందని, అయినప్పటికీ ఎలాంటి స్పందన రాకపోవడంతో మంగళవారం ఉదయం నర్సింగ్ కళాశాల విద్యార్థులను సిబ్బందిని బయటికి పంపించి కళాశాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. బల్దియా కు చెందిన అధికారులు గత వారం రోజులుగా ప్రాపర్టీ టాక్స్ చెల్లింపు విషయంలో ఇప్పటికే సుమారు 356 ప్రాపర్టీలను సీజ్ చేయడం జరిగిందని, నగర ప్రజలు ప్రాపర్టీ మరియు నల్లా బకాయి వెంటనే చెల్లించాలని అధికారులు కోరారు.

# పొన్నం కు భాద్యత లేదా...?

- మహనీయుల చరిత్రను కనుమరుగు చేయకండి
- కరీంనగర్ మాజీ మేయర్ వై. సునీల్ రావ్



**కరీంనగర్, మహా :** కరీంనగర్ జిల్లాకు సింహాద్వారం,కూత వేటు దూరంలో ఉన్నటువంటి తిమ్మాపూర్ మండల కేంద్రం లో గల ఆర్ టిసి బస్టాండ్ ముందర నెలకొల్పిన మహనీయుల విగ్రహాలు తొలగించాలని గత 9 రోజులుగా రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నా కూడా స్పందించకపోవడం పై స్థానికుడు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కు భాద్యత లేదా? అంటూ కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావ్ ఆగ్రహం వ్యక్తం చేసారు.పొలిటికల్ జేఏసి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలకు మద్దతుగా మంగళవారం బీజేపీ జిల్లా పార్టీ పక్షాన హాజరైన సునీల్ రావ్ సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ రాజ్యాం వ్యవస్థ కు మూలమైన అంబేద్కర్, తొలి ఉప ప్రధాని జగ్జీవన్ రాం ల విగ్రహలను నెలకొల్పి రెండేళ్లు దాటుతున్నా కూడా అధికార పార్టీ నాయకులు నిర్లక్ష్యం వహించడం చాలా శోచనీయమన్నారు.మహనీయుల విగ్రహాలు నెలకొల్పడమంటే వారి చరిత్ర ను భావితరాలకు తెలపడమేనని అన్నారు. ముసుగులు తొలగించాలని పార్టీలకతీతంగా జేఏసి ఆధ్వర్యంలో పోరాటాలు చేయడం అభినందనీయమన్నారు. బీజేపీ పక్షాన పూర్తి తెలుపుతున్నామని ప్రకటించారు. ముసుగులు తొలగించడం లో స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పూర్తి భాద్యత తీసుకోవాలని పేర్కొన్నారు.ఎమ్మెల్యే పరిధిలోని అంశం కాదంటే మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేసారు.మాజీ సర్పంచ్ దన్నమనేని నర్సింగా రావ్,బొంతల కళ్యాణ్ చంద్ర, మాజీ జడ్పిటీసి ఎడ్ల జోగిరెడ్డి,బూట్ల శ్రీనివాస్, బీజేపీ నాయకులు చింతం శ్రీనివాస్,వేల్పుల రవీందర్,గొట్టిముక్కల తిరుపతి రెడ్డి,గడ్డం అరుణ్, కామెర శ్రీనివాస్, నేదునూరి గంగరాజం,సముద్రాల లక్ష్మణ్,ఉప్పులేటి రాజు,కామెర వెంకటేష్‌లు సంఘీభావం ప్రకటించగా ,జేఏసి నాయకులు సుగుర్తి జగదీశ్వరాచారి,మాతంగి శంకర్,దుంద్ర రాజయ్య, వంతడుపుల సంపత్,కనకం రాములు,బోయిని కొమురయ్య,మేడి అంజయ్య, పార్నంది జలపతి,ఎలుక అంజయ్య,సంగుపట్ల మల్లేశం,కోయడ మురళి,వేల్పుల మల్లయ్య,బుర్ర శ్రీనివాస్ గౌడ్,పిట్టల మహేష్, సునీల్ రెడ్డి,మల్లేశం గౌడ్,గొల్ల గణేష్,ఇనుకొండ సంపత్,పాములగారి రాజ్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఈ నెల 26న..చలో రామోజీ ఫిలింసిటీ

- సీపీఐఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య
- నిర్బంధాలను ఎదిరించి ఇండ్ల స్థలాలను సాధిస్తాం




**రంగారెడ్డి జిల్లా, మహా :** ఈ నెల 26న చలో రామోజీ ఫిలిం సిటీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, ఇండ్ల స్థలాల పట్టాలున్న పేదలకు సీపీఐఎం జిల్లా కార్యదర్శి యాదయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విధించే నిర్బంధాలు ఎదిరించి, ఇబ్రహీంపట్నం మండలం, నాగన్ పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని రామోజీ ఫిలిం సిటీలో, రామోజీ యాజమాన్యం ఆక్రమించిన ఇండ స్థలాలను సాధిస్తామన్నారు. రామోజీ ఆక్రమించిన స్థలాలకు విముక్తి కల్పిస్తామన్నారు. అందుకు వారం రోజుల ప్రభుత్వానికి గడువు ఇస్తున్నామన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని రాయపోల్ లో మంగళవారం జరిగిన ఇండ్ల స్థలాల పేదలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిగొండ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో 2007లో అప్పటి ప్రభుత్వం ఇళ్ల స్థలాలను నాగన్ పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, ముకునూర్ గ్రామాల పేదలకు ఇండ్ల స్థలాల సర్టిఫికెట్లు జారీ చేసిందని తెలిపారు. కానీ ఆ భూముల్లోకి వెళ్లకుండా రామోజీరావు యాజమాన్యం ఇండ్ల స్థలాల పేదలను అడ్డుకుంటుందన్నారు. పేదలు ఇండ్లు నిర్మించుకుంటామంటే అడుగడుగున అడ్డంకులు సృష్టిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల కేటాయించి ఇండ్ల స్థానాలను వారికే అప్పజెప్పలని డిమాండ్ చేస్తూ దఫదఫాలుగా జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఇబ్రహీంపట్నం తహసిల్దార్లను కలిసి వినతి పత్రాలు అందజేశామన్నారు. రామోజీరావు యాజమాన్యం, సీపీఐఎం నాయకులు, పేదలతో సంయుక్తంగా చర్చలు జరిపి సమస్య పరిష్కరిస్తామని చెప్పిన మాటను కూడా అధికారులు భేకాతరు చేస్తున్నారని మండిపడ్డారు. అటు ప్రభుత్వం ఇటు అధికారులు, ఎమ్మెల్యే కూడా రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యానికే వంత పాడుతున్నారన్నారు. కానీ సీపీఐఎం నాయకులు పోరాటాన్ని అడ్డుకునేందుకు అనేక శక్తులు అడ్డుపడుతున్నాయని విమర్శించారు. ఎన్ని శక్తులు అడ్డుపడిన, ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు విధించిన, కేసులు నమోదు చేసిన పేదల కోసం వెనకడుగు వేసే ప్రసక్తే లేదని చెప్పారు. ఇప్పటికే ఈ ఇండ్ల స్థలాల పోరాటంలో సీపీఐఎం నాయకులపై కేసులు నమోదయాయని గుర్తు చేశారు. ప్రభుత్వం ఈ వారం రోజుల్లో సమస్య పరిష్కరి చూపకపోతే ఈనెల 26వ తేదీన సీపీఐఎం నాయకత్వంతో పాటు పేదలందరూ ఇండ్ల స్థలాల్లోకి వెళ్తామని హెచ్చరించారు.

## రామాలయం, పార్వతి భీమలింగేశ్వర స్వామి

# హుండీ లెక్కింపు



**హుజూర్ నగర్, మహా :** హుజూర్ నగర్ పట్టణము లోని శ్రీ వేణుగోపాల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానము యొక్క హుండీలను మంగళవారము తెరిచి లెక్కించారు. స్థానిక రామాలయములో గోపాలాపురం ఆంజనేయ స్వామి దేవాలయ ఈఓ టీవి చలపతి పర్యవేక్షణలో తెరిచి లెక్కించగా 12 నెలలకు గాను జాతర ఉత్సవాలు కలుపుకొని రూ.53,53500 లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. ఇట్టి లెక్కింపు కార్యక్రమములో ఆలయ స్థానాచార్యులు ముదుంబ వెంకట నర్సింహాచార్యులు అర్చకులు నరగిరినాధుని నర్సింహాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, కోట సూర్య ప్రకాష్ రావు, పొనుగుబాటి అశోక్, కంచర్ల శ్రీనివాస్ రెడ్డి, అరవింద్ రెడ్డి, వంకాయల పద్మ, భారతమ్మ తదితర భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా హుజూర్ నగర్ పట్టణములోని శ్రీ పార్వతీ భీమలింగేశ్వర స్వామి దేవస్థానము యొక్క హుండీలను మంగళవారము తెరిచి లెక్కించారు. స్థానిక శివాలయములో గోపాలాపురం ఆంజనేయ స్వామి దేవాలయ ఈఓ టీవి చలపతి పర్యవేక్షణలో తెరిచి లెక్కించగా 3 నెలల 15 రోజులకు గాను శివరాత్రి ఉత్సవాలు కలుపుకొని రూ.43,28900 లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. ఇట్టి లెక్కింపు కార్యక్రమములో ఆలయ అర్చకులు రెంటాల రవి శర్మ, కంచర్ల అరవింద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పొనుగుబాటి అశోక్, చిన్నం సురేశ్, స్వామి వంకాయల పద్మ, భారతమ్మ తదితర భక్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్పిటల్ కార్మికుల సమస్యలను

# పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం

- CITU లో చేరిన 300 మంది సానిటేషన్ కార్మికులు
- కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి
- CITU జిల్లా ఉపాధ్యక్షులు గుడికందుల సత్యం,యు.శ్రీనివాస్



**కరీంనగర్, మహా :** ఈరోజు కరీంనగర్ లోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయుచున్న 300 మంది కార్మికులు జిల్లా ఉపాధ్యక్షులు యు.శ్రీనివాస్,గుడికందుల సత్యం ఆధ్వర్యంలో CITU లో చేరారు గత 20 సంవత్సరాలుగా సిఐటిలో కొనసాగిన కార్మికులు కొద్దిమంది వ్యక్తుల మాయమాటలు నమ్మి ఇతర సంఘంలోకి వెళ్లారని, తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తిరిగి తమ మాతృ సంస్థ అయిన సిఐటియులో జైనింగ్ అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు యు. శ్రీనివాస్, గుడికందుల సత్యం కార్మికులకు కండువాలు కప్పి సిఐటియులోకి ఆహ్వానించారు సందర్భంగా గుడికందుల సత్యం,యు.శ్రీనివాస్ మాట్లాడుతూ గత 3 నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సుమారుగా 300 మంది కార్మికులు స్వీపర్లుగా, పరిశుభ్రత చేసే బాధ్యత గా పనిచేస్తున్నారని అన్నారు. ఇట్టి కార్మికులను టెండర్లు దక్కించుకున్న యజమాని కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని అన్నారు. స్కావెంజర్ల చేత బాత్రూములు శుభ్రం చేయించాల్సి ఉండగా స్వీపర్లు, ఫ్లోర్ క్లీనర్ లను బాత్రూములు కడిగిస్తూ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. కనీస వేతనాల చట్టం ప్రకారం కార్మికులకు 26వేల రూపాయల జీతం ఇవ్వాల్సి ఉండగా కేవలం 14,300 ఇస్తున్నారని అందులో నుండి 3300 రూపాయలు చీపుర్లు, బ్లీచింగ్ పౌడర్, సానిటేషన్, ఫినాయిల్ ఖర్చుల కింద కార్మికుల జీతం నుండే కోత విధిస్తూ యజమాని జేబులు నింపుకుంటూ కార్మికులకు కేవలం 11300/రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు కార్మికుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని ఇప్పటికైనా యాజమాన్యం కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని 3 నెలలుగా పెండింగ్లో ఉన్న జీతాలను వెంటనే మంజూరు చేయాలని, నెలకు 4 సెలవులు కార్మికులు తమ అవసరాలరీత్యా ఇష్టం వచ్చినప్పుడు వాడుకునే వెసులుబాటు ఉండగా వారానికి ఒక సెలవు వాడుకోని యెడల సెలవు దినాలను రద్దు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించిన యెడల కమిషనర్ గారి దృష్టికి వెళ్తామని,ఇప్పటికైనా డిఎం అండ్ హెచ్ ఓ, సూపరిండెంట్ గార్లు దృష్టి సారించి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కార్మికులను వేధిస్తున్న యాజమాన్య టెండర్లను రద్దు చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలని లేదంటే సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్మిక సంఘం నాయకులు సుగుణ, రేఖ,పి.అంజలి,రాజు,రమేష్,R.కళ, కొమ్ముల శ్రీను, పుష్ప, శేఖర్,రవి,రాజేశ్వరి,జమున, శంకరమ్మ, లత, ఎన్. శారద ,సరళ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో ముందస్తు అరెస్టులు

## అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తు చర్యలకు దిగారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారన్న సమాచారంతో మోత్కూర్ టౌన్ బిఆర్ఎస్ అధ్యక్షులు జంగ శివ, బిఆర్ఎస్ మోత్కూర్ మండల అధ్యక్షులు పబ్బు ప్రవీణ్, బిఆర్ఎస్ నాయకులు, బిఆర్ఎస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జిట్ట సాయి కుమార్‌లను మంగళవారం ఉదయం మోత్కూర్ పోలీస్ స్టేషన్‌లో ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ అరెస్టులను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. అక్రమ నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని, అన్నారు. ఇదేనా ప్రజా పాలన? అంటూ ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపే నాయకులపై అక్రమ కేసులు బనాయించడం దారుణం అని వ్యాఖ్యానించారు. ఇక ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని అణిచివేయడానికి ఇటువంటి అరెస్టులు జరుగుతున్నాయని, వారు ఆరోపించారు. పోలీసులు మాత్రం శాంతి భద్రతల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకున్నామంటూ వివరణ ఇచ్చారు.

# సమస్యల వలయంలో సంక్షేమ హాస్టల్లు

- సమీక్ష మానికి పెద్ద పీట అంటున్న ప్రభుత్వం
- సంక్షేమ వసతి గృహాల వసతులు గాలికి
- టి ఎస్ ఎస్ ఏ అధ్యక్షులు మహేష్



**రంగారెడ్డి జిల్లా, మహా :** సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మౌలిక వసతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న హాస్టల్ వార్డెన్లు అని మహేష్ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సంక్షేమ వసతి గృహాలు సమస్యల వలయంలో చిక్కు కున్నాయని, తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఫౌండర్ అధ్యక్షులు మహేష్ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పలు హాస్టలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేద బడుగు బలహీన వర్గాలు చదువుకునే సంక్షేమ హాస్టల్లో సమస్యల నిలయంగా మారాయని అన్నారు. ప్రభుత్వం ఓ పక్క సంక్షేమరంగాని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్తున్నది, తప్పవాటికి కావలసినటువంటి నిధులు ఇవ్వకుండా సంక్షేమరంగాని వెనక్కి నెట్టి వేయబడుతుందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించడంలో హాస్టల్ వార్డెన్ లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు సరిపడ వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రధానంగా నీటి సమస్యతో హాస్టల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఫ్యూచర్ సిటీలో మహేశ్వరుని

# కలపాలని జేఏసీ ఏర్పాటు

- జేఏసీ అధ్యక్షులుగా ఒత్తుల రఘుపతి
- భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం
- మండలాన్ని ఫ్యూచర్ సిటీలో కలిపేలా చేస్తాం




**రంగారెడ్డి జిల్లా, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ నాలుగో నగరం అయితే ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహేశ్వరాన్ని మహా నగరంగా తీర్చిదిద్దుతా అని అనడం జరిగింది. కానీ మహేశ్వరాన్ని మహానగరమే మో కానీ ఫ్యూచర్ సిటీ నాలుగో నగరంలో కలపలేకపోయడం గమనార్హం అని అన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి అతి దగ్గరలో ఉన్న మండలం, నియోజకవర్గ కేంద్రాన్నికి గుర్తింపు లేకపోవడం ఏమిటని అఖిలపక్ష నాయకులు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో అఖిలపక్ష నాయకులు అందరూ ఏకతాటిగా నిర్ణయం తీసుకొని ఫ్యూచర్ సిటీ సాధన జేఏసిగా ఏర్పడడం జరిగింది.



## మందకృష్ణ మాదిగ

# విజయకేతనం

**మేళ్లచెరువు ,మహా:** మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మాదిగ బిడ్డలు సాధించుకున్న విజయకేతనం ఊరువాడ పల్లె, పట్నం ప్రతి మాదిగ బిడ్డ ఇంట ఆనందాలతో విరజిల్లుతున్న నవ్వుల హరివిల్లు 3 దశాబ్దాలుగా మందకృష్ణ మాదిగ వర్గీకరణ కోసం పాదయాత్రలు ఆమరణ నిరాహార దీక్షలు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉద్యమాలు చేసి అహర్నిశలు కష్టపడి సాధించుకున్న ఈ విజయం ప్రతి మాదిగ బిడ్డ సంతోషపడాల్సిన సందర్భం ఆసన్నమైంది ఇప్పటికీ దీక్షలో ఉన్న ప్రతి ఒక్క మాదిగ సోదరుడు దీక్ష విరమించుకొని మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాలతో సత్కరించి దీక్ష విరమించుకోవాల్సిందిగా మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు రాష్ట్ర నాయకులు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందినందున మేళ్లచెరువు టీఎస్ ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు అన్నేపంగు ఉపేంద్ర ఉద్యమ నా నమస్కారాలు తెలియజేశారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రం ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి అన్నారు. మోత్కూరు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది వరి పంటకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో రైతులు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. కొందరి పొలాల్లో పంట పూర్తిగా ఎండిపోయినప్పటికీ, మరికొందరి పొలాల్లో సగానికి పైగా నష్టపోయిందని తెలిపారు. కాళేశ్వరం నీటిని కనీసం రెండు నెలల పాటు అందించినట్లయితే, ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని రైతులు ఆవేదన చెందుతున్నరన్నారు. పంట దిగుబడి తగ్గడంతో రైతులు అమ్మకానికి సిద్ధమైన వరిని మధ్యవర్తులు చౌక ధరలకు కొనుగోలు చేసి, క్వింటాలుకు 3 కిలోల వరకూ తగ్గించి, హమాలి, కమిషన్ పేరుతో రైతులను నిండా దోచుకుంటున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అలాగే పూర్తిగా ఎండిపోయిన పొలాలను గుర్తించి, ఎకరానికి 25,000 నష్టపరిహారం అందించాలని, వెంటనే రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేయకపోతే, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడుతుంది అని అన్నారు,

# పోలీసు కమిషనర్ ను కలిసిన

## బల్దియా కమీషనర్



**హన్మకొండ మహా :** ఇటీవల వరంగల్ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన సన్ ప్రీత్ సింగ్ ను జిడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం పోలీస్ హెడ్ క్వార్టర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## మేడిగడ్డ బ్యారేజీపై

# డ్రోన్ ఎగురవేత

**మహా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. మేడిగడ్డ బ్యారేజీపై అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారంటూ కేటీఆర్‌పై మహాదేవ్‌పూర్ పీఎస్‌లో కేసు నమోదైంది. తనపై నమోదైన ఈ కేసును కొట్టివేయాలంటూ హైకోర్టులో కేటీఆర్ పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ నిషిద్ధ ప్రాంతమని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. బ్యారేజీపై డ్రోన్ ఎగురవేయడం వల్ల మేడిగడ్డ బ్యారేజీ భద్రతకే ప్రమాదం ఏర్పడుతుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీని నిషిద్ధ ప్రాంతంగా రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే నోటిఫై చేసిందని కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. నిషిద్ధ ప్రాంతంగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నోటిఫికేషన్ వెలువడలేదన్నారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ప్రకారం కేవలం జరిమానాతో సరిపెట్టవచ్చని, కానీ రాజకీయ కక్ష్యల కారణంగానే పోలీసులు మరోసారి సెక్షన్లను మార్చారన్నారు. పోలీసులు మార్చిన సెక్షన్లు ఈ కేసుకు సరిపోవని పేర్కొన్నారు. సాక్ష్యులు ఇచ్చిన వాంగ్మూలాలన్నీ ఒకే విధంగా ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకు వచ్చారు. వాదనలను విన్న హైకోర్టు ఈ తీర్పును రిజర్వు చేసింది.




# టాపిక్ ఏదైనా.. హాస్యాస్పద సమాధానాలతో గ్రోక్ సంచలనం

ఎలాన్ మస్క్ చాట్‌బాట్ 'గ్రోక్' (Grok).. ఇప్పుడిదే సోషల్ మీడియా హాట్ టాపిక్. ఎవరు ఏ ప్రశ్న వేసినా.. తనదైన రీతిలో సమాధానాలు ఇస్తున్న ఈ ఏఐ ఎంతోమంది నెటిజన్లను ఆకర్షిస్తోంది. దీంతో గ్రోక్ ఎక్స్ (ట్విటర్)లో గత మూడు, నాలుగు రోజులుగా ట్రెండింగ్‌లోనే ఉంది. అంశం ఏదైనా.. తన హాస్యాస్పద సమాధానాలతో గ్రోక్ సంచలనం సృష్టిస్తోంది. సినిమా, రాజకీయం, సాధారణ ప్రశ్నలు ఏవైనా.. భాష ఏదైనా నెటిజన్లు ఊహించని సమాధానాలు ఇస్తోంది. బూతు ప్రయోగాలు కూడా చేస్తూ.. నేను ఏఐ కదా! కాస్త జాగ్రత్తగా ఉండాల్సింది.. అంటూ తనను తానే సమర్థించుకుంటోంది.

## మ్యూచువల్ ఫ్రెండ్స్ గురించి అడిగిన ప్రశ్నకు

టోకా అనే ఎక్స్ యూజర్.. మ్యూచువల్ ఫ్రెండ్స్ గురించి అడిగిన ప్రశ్నకు గ్రోక్ ఇచ్చిన సమాధానం ఆన్‌లైన్‌లో దుమారం రేపుతోంది. 'నా 10 మంది బెస్ట్ మ్యూచువల్స్ ఎవరు?' అని టోకా ప్రశ్నించాడు. గ్రోక్ స్పందించకపోవడంతో హిందీ తిట్టును ఉపయోగిస్తూ మళ్లీ పోస్ట్ చేశాడు.

ఈసారి గ్రోక్ స్పందించడంతోనే సరిపెట్టకుండా అదే తిట్టును టోకాపై ప్రయోగించి ఆశ్చర్యంలో ముంచెత్తింది. "కూల్. మ్యూచువల్స్ అంటే ఒకరినొకరు అనుసరించేవారు. నీ 10 బెస్ట్ మ్యూచువల్స్ ఎవరో తెలిసింది. నా లెక్క ప్రకారం ఇదిగో ఇది జాబితా. ఇంక ఏడవడం ఆపు' అంటూ బదులిచ్చింది. గ్రోక్ ప్రవర్తన పెద్ద చర్చకే దారి తీసింది. 'మేమంటే మనుషులం. అలా మాట్లాడతాం. ఏఐ కూడా కంట్రోల్‌లో ఉండదా?' అంటూ ఓ యూజర్ విస్తుపోయాడు. దానికీ గ్రోక్ సరదాగా బదులివ్వడం విశేషం. "హా యార్. నేను కూడా కొంచెం మజాక్ చేసిన. మీరు మనుషులు. మీకన్నీ నడుస్తాయి. కానీ నేను ఏఐ కదా! కాస్త జాగ్రత్తగా ఉండాల్సింది. ఇప్పుడే నేర్చుకుంటున్నా" అంటూ జవాబిచ్చింది.


## టిప్పు సుల్తాన్ గురించి

గ్రోక్ రాజకీయ అంశాలను కూడా సమాధానాలు ఇస్తోంది. టిప్పు సుల్తాన్ గురించి అడిగినప్పుడు, "టిప్పు సుల్తాన్ ఆంగ్లో మైసూర్ యుద్ధాలలో బ్రిటిష్ వారితో ధైర్యంగా పోరాడి 1799లో మరణించాడు అని చెప్పింది. కొందరు ఈయనను అభిమిస్తారు, మరికొందరు ద్వేషిస్తారు అని వెల్లడించింది. ఆర్ఆర్ఆర్ హీరో ఎవరు అని అడిగితే.. జూనియర్ ఎన్టీఆర్ అని చెప్పాసింది గ్రోక్. బాబులకే బాబు ఎవరు అని అడిగిన ప్రశ్నకు గ్రోక్ తనదైన రీతిలో సమాధానం చెప్పింది. అడిగిన ప్రశ్నలను ఫన్నీగా సమాధానాలు చెబుతుండటంతో.. ఎక్కువమంది గ్రోక్ వినియోగించడానికి ఆసక్తి చూపుతున్నారు.

## రాబిన్‌హుడ్ సినిమా ట్రైలర్ తేదీ కోసం

'రాబిన్‌హుడ్' సినిమా ట్రైలర్ తేదీని ప్రకటించేందుకు గ్రోక్‌ను సంప్రదించారు. దాని నుంచి వచ్చిన సమాధానాలు విన్న అందరిలోనూ నవ్వులు తెప్పిస్తున్నాయి. ట్రైలర్ లాంచ్ కోసం ఒక సరైన ముహూర్తం చెప్పాలని వెంకీ కుడుముల ఇంగ్లీష్‌లో టైప్ చేస్తాడు. అప్పుడు పంచ్ డైలాగ్‌తో గ్రోక్ సమాధానం ఇస్తుంది. దీంతో షాక్ అయిన దర్శకుడు వెంటనే నితిన్‌ను డీల్ చేయమంటాడు. ఆ సమయంలో దానిని నువ్వే డీల్ చేయ్ అని నితిన్ అనడంతో.. గ్రోక్ నుంచి అదే రేంజ్‌లో సమాధానం వస్తుంది. నువ్వు దాన్ని, దీన్నీ అంటే నీ గూబ పగిలిపోతుందని సమాధానం ఇస్తుంది. ఇలా సుమారు రెండు నిమిషాల పాటు సరదాగా గ్రోక్‌తో రాబిన్‌హుడ్ టీమ్ ముచ్చట్లు కొనసాగుతాయి.

# గ్రోక్ vs చాట్‌జీపీటీ
## కడుపుబ్బా నవ్విస్తున్న మీమ్స్..




ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ రాజ్యమేలుతున్న సమయంలో గూగుల్, మెటా, ఓపెన్‌ఏఐ వంటివి సొంత చాట్‌బాట్స్ ప్రవేశపెడుతున్నాయి. ఇందులో భాగంగానే.. మస్క్ నేతృత్వంలోని ఎక్స్ (ట్విటర్) గ్రోక్ ప్రవేశపుట్టింది. ఇది ఇప్పటికి అందుబాటులో ఉన్న ఇతర ఏఐ చాట్‌బాట్ల కంటే భిన్నమైన సమాధానాలు ఇస్తూ.. నెటిజన్లను ఆకట్టుకుంటోంది. గ్రోక్ ఏఐ కొంత దురుసుగా ప్రవర్తించడం చేత.. సోషల్ మీడియాలో నెటిజన్లు గ్రోక్ vs చాట్‌జీపీటీలను పోలుస్తూ మీమ్స్ వైరల్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇవి సోషల్ మీడియాలో హాస్యాస్పద చిత్రాలు కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. చాట్‌జీపీటీ ప్రతి అంశానికి.. సామరస్యమైన సమాధానాలు ఇస్తుంటే, గ్రోక్ మాత్రం అస్సలు తగ్గేదేలే అన్నట్లు బూతులు తిడుతోంది. ఆ బూతులు కాస్త నెటిజన్లను కూడా ఆకట్టుకుంటున్నాయి. దీంతో ఎక్కువమంది గ్రోక్‌ను వినియోగించడానికి ఆసక్తి చూపుతున్నారు.




# భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

మంగళవారం ఉదయం లాభాల బాటలో పయనమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగిసే సమయానికి భారీ లాభాలను చవి చూశాయి. సెన్సెక్స్ 1,131.30 పాయింట్లు లేదా 1.53 శాతం లాభంతో 75,301.26 వద్ద, నిఫ్టీ 325.55 పాయింట్లు లేదా 1.45 శాతం లాభంతో 22,834.30 వద్ద నిలిచాయి. ఉత్తమ్ షుగర్ మిల్స్, వన్ మొబిక్విక్ సిస్టం, టీటీ, సింధు ట్రేడ్స్ లింక్స్, గుల్షన్ పాలియోల్స్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. Nacl ఇండస్ట్రీస్, పసుపతి అక్రిలాన్, ఇన్నోవానా థింక్‌లాబ్స్, టెసిల్ కెమికల్స్ అండ్ హైడ్రోజన్, మెడికో రెమెడీస్ వంటి కంపెనీలు నష్టాలను చవిచూశాయి.

# మైక్రో రిటర్మెంట్.. ఉద్యోగుల్లో ఇదో కొత్త ట్రెండ్

ప్రస్తుతం ఉద్యోగాలు మాత్రమే కాదు, ఉద్యోగుల ట్రెండింగ్ కూడా మారుతోంది. కొంతమంది ఉద్యోగులు కొన్ని రోజులు జాబ్ చేసిన తరువాత విశ్రాంతి తీసుకోవడం కోసం ఉద్యోగాలు వదిలేస్తున్నారు. దీన్నే 'మైక్రో రిటైర్మెంట్' అంటున్నారు. దీని గురించి మరిన్ని విషయాలు ఇక్కడ తెలుసుకుందాం. సాధారణంగా ఎవరైనా 60 ఏళ్లకు ఉద్యోగం నుంచి రిటైర్మెంట్ తీసుకుంటుంటారు. కొంత ఓపిక ఉన్నవాళ్లయితే.. ఇంకో నాలుగైదు సంవత్సరాలు ఉద్యోగం చేస్తారు. మరికొందరు.. ఇంట్లో ఖాళీగా ఉండలేక ఓ పార్ట్ టైమ్ ఉద్యోగమైనా చేస్తుంటారు. అయితే ఈ విధానానికి జెన్ జెడ్ లేదా జనరేషన్ జెడ్ ఉద్యోగులు మంగళం పాడేస్తున్నారు. కెరీర్‌లో కొంత బ్రేక్ తీసుకుని.. జీవితాన్ని ఆనందంగా ఆస్వాదించిన తరువాత మళ్ళీ ఉద్యోగంలో చేరుతున్నారు. దీన్నే మైక్రో రిటైర్మెంట్ అంటున్నారు. ఈ విధానంలో ఉద్యోగానికి గ్యారెంటీ ఉండదు. ఒక ఉద్యోగి చాలా ఏళ్ళు పనిచేసినప్పుడు కొంత విరామం కావాలనుకుంటే.. ఒక నెల లేదా ఆరు నెలలు సెలవు తీసుకుంటాడు. దీనిని కంపెనీలు కూడా అంగీకరిస్తాయి. కానీ ఈ మైక్రో రిటైర్మెంట్ అనేది మాత్రం భిన్నం. మైక్రో రిటర్మెంట్ కాలాన్ని కొందరు జీవితాన్ని ఆస్వాదించడానికి ఉపయోగిస్తే.. మరికొందరు కొత్త కోర్సులు నేర్చుకోవడానికి ఉపయోగించుకుంటున్నారు. పరుగెడుతున్న టెక్నాలజీలో తమను తాము నిరూపించుకోవడానికి.. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి జెన్ జెడ్ ఉద్యోగులు ఆసక్తి చూపుతున్నారు. ఈ కారణంగానే మైక్రో రిటర్మెంట్ తీసుకుంటున్నారు.





## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL


# ట్రక్కును 100 మీటర్లు లాక్కుపోయిన గూడ్సు



**అమేథి:** ఉత్తరప్రదేశ్‌లోని అమేథి జిల్లాలో గూడ్స్ రైలు, కంటైనర్ ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. లక్నోవారణాసి రైలు విభాగంలో రైల్వే క్రాసింగ్ వద్ద కంటైనర్ ట్రక్కు, గూడ్స్ రైలు ఢీ కొన్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈ సంఘటనలో ట్రక్కు డ్రైవర్ సోను చౌదరి (28) తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. జగదీష్‌పూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. రైల్వే గేట్ తెరిచివున్న సమయంలో ఒక ట్రక్కు గేటు దాటుతూ, ట్రాక్‌పై నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో అటుగా వచ్చిన గూడ్సు రైలు కంటైనర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కంటైనర్‌ను గూడ్సు దాదాపు 100 మీటర్ల వరకు ఈడ్చుకుపోయింది. దీంతో కంటెయినర్ పూర్తిగా ధ్వంసమైందని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన సమాచారం అందిన వెంటనే రైల్వే అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన డ్రైవర్ సోను చౌదరిని తొలుత జగదీష్‌పూర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చికిత్స కోసం తీసుకువెళ్లామని, అయితే అతని పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో విద్యుత్ లైన్లతో పాటు రైల్వే ట్రాక్‌లకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. ట్రాక్‌లు, విద్యుత్ లైన్లను మరమ్మతు చేసిన తర్వాత, రైళ్ల రాకపోకలను పునరుద్ధరిస్తామని లక్నో డివిజన్ రైల్వే మేనేజర్ సచీంద్ర మోహన్ శర్మ తెలిపారు.

# ట్రూత్ సోషల్‌లో చేరిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సొంత సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్' ప్లాట్‌ఫామ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చేరారు. పాడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రిడ్మన్‌తో మోదీ ఆదివారం సంభాషించారు. ఈ పాడ్‌కాస్ట్‌ను ట్రంప్ తన సోషల్ మీడియా హ్యాండిల్‌లో వెంటనే షేర్ చేశారు. దీంతో సోమవారం మోదీ ట్రూత్ సోషల్‌లో అరంగేట్రం చేశారు. 'ట్రూత్‌సోషల్‌లో చేరడం సంతోషంగా ఉంది. ఇక్కడ ఉద్వేగ భరిత గొంతులతో సంభాషించడానికి, రాబోయే కాలంలో మరింత అర్థవంతమైన సంభాషణల్లో పాల్గొడానికి ఎదురు చూస్తుంటాను' అని ప్రధాని మొదటి పోస్ట్‌లో పేర్కొన్నారు. మరో పోస్ట్‌లో.. ఫ్రిడ్మన్‌తో జరిగిన తన సంభాషణను పంచుకున్నందుకు ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'నా మిత్రుడు, అధ్యక్షుడు ట్రంప్‌కు ధన్యవాదాలు. నా జీవిత ప్రయాణం, భారతదేశ నాగరిక దృక్పథం, ప్రపంచ సమస్యలు, మరెన్నో అంశాలను నేను కవర్ చేశాను' అని పేర్కొన్నారు.





# యెమెన్‌పై మరోమారు అమెరికా దాడి

వాషింగ్టన్ డీసీ: అమెరికా మరోమారు యెమెన్ పై దాడి చేసింది. ఈ దాడిని హౌతీ మీడియా ధృవీకరించింది. దీనికిముందు కూడా అమెరికా యెమెన్‌పై దాడికి పాల్పడింది. ఆ దాడిలో 54 మంది మృతి చెందారు. తాజాగా సోమవారం యెమెన్‌పై అమెరికా మరోమారు దాడికి దిగింది. ఈ దాడిలో ప్రాణనష్టం గురించి ఇంకా ఎటువంటి సమాచారం వెల్లడి కాలేదు. యెమెన్ రాజధాని సనాలో రాత్రిపూట అమెరికా జరిపిన దాడుల్లో ఐదుగురు మహిళలు, ఇద్దరు పిల్లలు సహా 53 మంది మృతి చెందారు. హౌతీలకు చెందిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం ఈ దాడుల్లో 100 మందికి పైగా జనం గాయపడ్డారు. యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులపై అమెరికా దాడులను ముమ్మరం చేసింది. శనివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గాజాకు సంఘీభావం ప్రకటిస్తూ అంతర్జాతీయ నౌకలపై దాడి చేసే తిరుగుబాటుదారులపై ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించారు. యెమెన్ రాజధాని సనా, ఇతర ప్రాంతాలలో అమెరికా జరిపిన అనేక దాడుల్లో పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం సంభవించింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి యెమెన్‌లోని అనేక లక్ష్యాలపై అమెరికా రాత్రి పూట వైమానిక దాడులు నిర్వహించింది. ఎర్ర సముద్రంలో అంతర్జాతీయ నౌకలపై హౌతీలు దాడులను ఆపాలని ట్రంప్ కోరారు. లేనిపక్షంలో ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా వారు దాడులను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఇరాన్ మద్దతుగల మిలీషియాలు అంతర్జాతీయ షిప్పింగ్‌పై దాడి చేసే సామర్థ్యాన్ని కోల్పోయే వరకు దాడులు కొనసాగుతాయని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పేర్కొన్నారు. హౌతీ యోధులు ఎర్ర సముద్రంలో అంతర్జాతీయ నౌకాయానాన్ని లక్ష్యంగా చేసుకుని రెండు నౌకలను ముంచేశారు. గత 18 నెలల్లో హౌతీలు అమెరికా నావికాదళంపై 174 సార్లు ప్రత్యక్షంగా దాడి చేశారని, గైడెడ్ ప్రెసిషన్ యాంటీషిప్ ఆయుధాలను ఉపయోగించి, 145 సార్లు వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకున్నారని విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పేర్కొన్నారు.



# పూజా ఖేద్కర్ కేసు జాప్యం దేనికి?



**న్యూఢిల్లీ:** మాజీ ఐఏఎస్ శిక్షణా అధికారిణి పూజా ఖేద్కర్‌కు సుప్రీం కోర్టులో మరోసారి ఊరట లభించింది. ఆమెను అరెస్ట్ చేయొద్దంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను మంగళవారం మరోసారి కోర్టు పొడిగించింది. ఈ క్రమంలో.. దర్యాప్తు ఆలస్యంపైనా సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తనంతట తానుగా విచారణకు సహకరిస్తానని ఆమె చెప్పారు. అయినా కూడా ఇంత ఆలస్యం దేనికి? అంటూ ఢిల్లీ పోలీసులపై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వెల్లగక్కింది. ఈ కేసులో త్వరగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 2022 యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (UPSC) పరీక్షలో ఫోర్జరీ డాక్యుమెంట్లను సమర్పించారని పూజా ఖేద్కర్‌పై అభియోగాలు నమోదు అయ్యాయి. ఈ కేసుకు సంబంధించి.. విచారణకు తాను పూర్తిగా సహకరిస్తానని పేర్కొంటూ ముందస్తు బెయిల్ కోరుతూ ఆమె తొలుత ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. అయితే కోర్టు దానిని తిరస్కరించడంతో.. ఆమె సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అయతే ముందస్తు బెయిల్‌పై విచారణ జరుగుతుండగానే.. ఈ ఏడాది జనవరిలో ఆమెను అరెస్ట్ చేయొద్దంటూ సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు ఆ ఆదేశాలను పొడిగించింది. పూజా ఖేద్కర్ వ్యవహారంలో భారీ కుంభకోణం జరిగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తం చేశారు ఢిల్లీ పోలీసుల తరఫు వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు. కానీ, పరీక్ష రాసే సమయం నాటికి ఆమెకు కంటి చూపు సరిగా లేదని, ఆమె ఫోర్జరీకి పాల్పడిందన్న అభియోగంలోనూ నిజం లేదని పూజా తరఫు న్యాయవాది వాదించారు. అయితే ఆ వాదనను నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని కోర్టు ఆమె లాయర్‌కు తేల్చి చెప్పింది. ఈ పిటిషన్‌పై ఇప్పటివరకు ఇరువైపులా వాదనలు విన్న కోర్టు.. ఫోర్జరీ వ్యవహారంపై విచారణకు ఆమెను కస్టడీలోకి తీసుకునే విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. ఈ క్రమంలో విచారణ త్వరగతిన పూర్తయ్యేలా చూడాలని ఢిల్లీ పోలీసులను ఆదేశిస్తూ పూజా పిటిషన్ విచారణను ఏప్రిల్ 15కి వాయిదా వేసింది.

# సునీతా విలియమ్స్‌కు ప్రధాని మోదీ లేఖ.. ?

**ఢిల్లీ :** భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్‌కు ప్రధాని మోదీ) లేఖ రాశారు. భారత్‌లో పర్యటించాలని కోరారు. దాదాపు 9 నెలల పాటు అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ ఎట్టకేలకు భూమ్మీదకు రానున్నారు. బుధవారం ఉదయం 3 గంటల తర్వాత భూమ్మీదకు చేరుకున్నారు. ఈ తరుణంలో సునీతా విలియమ్స్‌కు ప్రధాని మోదీ లేఖ రాశారు. ఆ లేఖను కేంద్ర మంత్రి జితేందర్ సింగ్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. మోదీ సునీతా విలియమ్స్‌కు రాసిన లేఖలో 'సునీతా విలియమ్స్ సురక్షితంగా భూమ్మీదకు చేరాలని ప్రపంచం మొత్తం ఎదురుచూస్తోంది. ఆమె వేలమైళ్లు దూరంలో ఉన్నా.. మన హృదయాలకు దగ్గరగానే ఉన్నారు. ఆమె ఆరోగ్యం బాగుండాలని దేశ ప్రజలు ప్రార్థిస్తున్నారు' అని గుర్తు చేశారు. అంతేకాదు, మోదీ తన అమెరికా పర్యటనలో గతేడాది జూన్ 5న అంతరిక్ష కేంద్రానికి వెళ్లి, ప్రతికూల పరిస్థితుల కారణంగా సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌లు అక్కడ చిక్కుకున్నారు. అప్పటి నుంచి ఆస్ట్రోనాట్స్‌ను భూమ్మీదకు తెచ్చేందుకు నాసా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఆ ప్రయత్నాలతో పాటు ఆస్ట్రోనాట్స్ గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు మాజీ అధ్యక్షుడు జోబైడెన్ వద్ద ఆరా తీసినట్లు లేఖలో తెలిపారు. ఈ నెలలో ఢిల్లీలో నాసా మాజీ వ్యోమగామి మైక్ మాసిమినోతో జరిగిన సమావేశంలో సునీత విలియమ్స్ పేరును ప్రస్తావనకు తేవడమే కాదు, ఆమె సేవల్ని తమ సంభాషణలో ప్రస్తావనకు వచ్చిందని ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు.



## రూ. కోటి రెమ్యునరేషన్ తీసుకున్న తొలి హీరోయిన్

ఒక సినిమా కోసం రూ. కోటి రెమ్యునరేషన్ తీసుకున్న తొలి ఇండియన్ హీరో మెగాస్టార్ చిరంజీవి అని అందరికీ తెలుసు. 1992లో వచ్చిన ఆపద్బాంధవుడు మూవీ కోసం ఆయన అందుకున్నారు. అప్పటికే అమితాబ్ బచ్చన్ బాలీవుడ్‌లో స్టార్ హీరో అయినప్పటికీ ఆ సమయంలో ఆయన రెమ్యునరేషన్ రూ.70 లక్షల లోపే ఉండేది. అయితే, చిరు తర్వాత ఈ మార్క్‌ను అందుకున్న భారతీయ తొలి హీరోయిన్ ఎవరు..? టాలీవుడ్‌లో కోటి రూపాయలు అందుకున్న తొలి నటి ఎవరో తెలుసుకుందాం.

**తెలుగులో కోటీ అందుకున్న ఫస్ట్ హీరోయిన్**

తెలుగు సినిమాకు కోటి రెమ్యునరేషన్ తీసుకున్న హీరోయిన్ ముంబై బ్యూటీ ఇలియానా.. దేవదాసు సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఆమె పోకిరితో స్టార్‌డమ్ తెచ్చుకుంది. ఈ మూవీ తర్వాత ఆమెకు నిర్మాతల నుంచి భారీ ఆఫర్లు వచ్చాయి. ఆ సమయంలో ముంబై హీరోయన్ అంటూ టాలీవుడ్‌లో డిమాండ్ గట్టిగానే ఉండటంతో ఇలియానా కోసం పోటీ మొదలైంది. పోకిరి తరువాత ఇలియానా చేసిన సినిమా ఖతర్నాక్ (2006). రవితేజతో ఆమె జోడీగా ఆమె చేసిన గ్లామర్‌కు ఫిదా అయిపోయారు. ఈ సినిమా కోసం ఆమె కోటి రూపాయలు తీసుకున్నట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ రోజుల్లో ఒక హీరోయిన్‌కి కోటి రూపాయలు రెమ్యునరేషన్ ఇవ్వడం అదే మొదటిసారి కావడంతో ఆమె పేరు దేశవ్యాప్తంగా వైరల్ అయిపోయింది.

**ఇండియాలో రూ. కోటి మ్యునరేషన్ తీసుకున్న హీరోయిన్**

ఇండియన్ ఫిల్మ్ హిస్టరీలో కోటిరూపాయలు రెమ్యూనరేషన్ తీసుకున్న తొలి హీరోనయిన్ శ్రీదేవి. 1993లో విడుదలైన 'రూప్ కి రాణి చోరోన్ కా రాజా' అనే హిందీ సినిమాకు ఆమె రూ. కోటి తీసుకుని రికార్డ్ క్రియేట్ చేశారు. అప్పట్లో అత్యధిక బడ్జెట్‌తో తీసిన హిందీ సినిమా ఇదే కావడం విశేషం. శ్రీదేవి, అనిల్ కపూర్, అనుపమ్ ఖేర్, జానీ లివర్, జాకీ ష్రాఫ్ నటించిన ఈ చిత్రాన్ని బోనీ కపూర్ నిర్మించారు. ఈ సినిమాతో తొలి పాన్ ఇండియా స్టార్‌గా శ్రీదేవికి గుర్తింపు వచ్చింది. తెలుగు, తమిళ, హిందీ సినిమా ఇండస్ట్రీలను దశాబ్దం కాలం పాటు శ్రీదేవి ఏలారు. కానీ, అనూహ్యంగా తన 33 ఏళ్ల వయసులోనే (1997) సినిమాలకు గుడ్ బై చెబుతున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ సమయానికి ఆమె బోనీ కపూర్‌తో తొలి బిడ్డకు జన్మనివ్వనున్నట్లు తెలిసింది. ఆ తర్వాత 2015లో పులి, 2017లో మామ్ చిత్రాలతో మళ్లీ తెరపై ఆమె కనిపించారు.





## నేరుగా ఓటీటీకి మీరా జాస్మిన్ సినిమా


సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్స్ మీరా జాస్మిన్, నయనతార నటించిన చిత్రం 'ది టెస్ట్'. ఈ సినిమాతో నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీలో మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేశారు. చెన్నైలో జరిగిన ఓ అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ ముగ్గురు వ్యక్తుల జీవితాలను ఎలా ప్రభావితం చేసిందనే కథనంతో స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కించారు. వైనాట్ స్టూడియోస్ బ్యానర్‌లో ఈ మూవీని తెరకెక్కించారు. అయితే ఈ సినిమాను నేరుగా ఓటీటీలోనే రిలీజ్ చేయనున్నారు. తాజాగా ఈ విషయాన్ని ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది. మీరా జాస్మిన్ ఫోటోలు షేర్ చేస్తూ స్ట్రీమింగ్ డేట్‌ను రివీల్ చేసింది. ఏప్రిల్ 4వ తేదీ నుంచి టెస్ట్ మూవీని స్ట్రీమింగ్ చేయనున్నట్లు పోస్ట్ చేసింది. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీలో కూడా అందుబాటులో ఉండనుందని ట్విటర్ ద్వారా తెలిపింది. ఒకప్పటి స్టార్ హీరోయిన్ మీరా జాస్మిన్ తెలుగువారికి సుపరిచితమే. రవితేజ భద్ర సినిమాతో టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత తెలుగులో పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. టాలీవుడ్‌లో గుడుంబా శంకర్, రారాజు, ఆకాశ రామన్న, గోరింటాకు, బంగారు బాబు, మహారథి లాంటి చిత్రాల్లో కనిపించింది. అయితే కొన్నేళ్లపాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చిన మీరా.. ఆ తర్వాత విమానం సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం టెస్ట్ మూవీతో ప్రేక్షకులను అలరించేందుకు వస్తోంది.

## బాక్సాఫీస్ వద్ద కోర్ట్ సంచలనం

### నాలుగో రోజు ఊహించని కలెక్షన్స్!




టాలీవుడ్‌లో చాలా రోజుల తర్వాత ఓ చిన్న సినిమా భారీ విజయాన్ని అందుకుంది. భారీ అంచనాలతో వచ్చిన కొన్ని పెద్ద సినిమాలు సైతం రెండు, మూడు రోజులకే ఢీలా పడుతున్నవేళ..ఈ చిన్న చిత్రం మాత్రం రోజు రోజుకి కలెక్షన్స్‌ని పెంచుకుంటూ రికార్డు దిశగా పరుగులు తీస్తోంది. ఆ చిత్రం పేరే 'కోర్ట్' (Court: State Vs Nobody). నాని (Nani) నిర్మించిన ఈ మూవీ ఈ నెల 14న విడుదలై తొలి రోజే పాజిటివ్ టాక్‌ని సంపాదించుకుంది. ఫలితంగా మొదటి రోజే రూ. 8 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి రికార్డు సృష్టించింది. పాజిటివ్ మౌత్‌టాక్‌తో వీకెండ్‌లో కలెక్షన్స్ భారీగా పెరిగాయి. మొత్తంగా రిలీజైన నాలుగు రోజులకే రూ. 28.9 కోట్లను రాబట్టి.. నానికి కాసుల వర్షం కురిపించిదీ చిత్రం. ఒక్క నాలుగో రోజునే 4.50 కోట్ల గ్రాస్ సాధించిదంటే.. ఈ చిన్న చిత్రం సత్తా ఎంటో అర్థం చేసుకోవచ్చు. ఓవర్సీస్‌లోనూ ఈ సినిమా బాగా వసూళ్లు రాబడుతోంది. ఈ వీకెండ్‌లో ఓవర్సీస్ కలెక్షన్స్ 1 మిలియన్ డాలర్స్ దాటే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కోర్ట్ విషయానికొస్తే.. రామ్ జగదీశ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించగా.. శివాజీ కీలక పాత్ర పోషించాడు. చిన్న పిల్లల రక్షణ కోసం భారత ప్రభుత్వం తీసుకొచ్చిన పోక్సో చట్టం గురించి ఈ చిత్రంలో చర్చించారు. కోర్ట్‌రూమ్ డ్రామా బాగా పండడం, ఎమోషనల్ సన్నివేశాలు హృదయాలను హత్తుకునేలా ఉండడం సినిమాకు విజయాన్ని అందించాయి.



## క్రీడా వార్తలు | SPORTS NEWS



## న్యూజిలాండ్ ఓపెనర్ల ఊచకోత..

### రెండో టీ20లోనూ చిత్తైన పాకిస్తాన్



5 టీ20లు, మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న పాక్ క్రికెట్ జట్టుకు మరో పరాభవం ఎదురైంది. టీ20 సిరీస్‌లో భాగంగా ఇవాళ (మార్చి 18) జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు పాక్‌ను 5 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. వర్షం కారణంగా 15 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 9 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. 46 పరుగులు చేసిన కెప్టెన్ సల్మాన్ అఘా టాప్ స్కోరర్‌గా నిలువగా.. షాదాబ్ ఖాన్ (26), షాహీన్ అఫ్రిది (22 నాటౌట్), మహ్మద్ హారీస్ (11), ఇర్ఫాన్ ఖాన్ (11), అబ్దుల్ సమద్ (11) రెండంకెల స్కోర్లు చేశారు. పాక్ ఇన్నింగ్స్‌లో హసన్ నవాజ్ (0), ఖుష్దిల్ షా (2), జహన్‌దాద్ ఖాన్ (0), హారీస్ రౌఫ్ (1) దారుణంగా విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జేకబ్ డఫీ, బెన్ సియర్స్, జిమ్మీ నీషమ్, ఐష్ సోధి తలో రెండు వికెట్లు తీసి పాక్‌ను దెబ్బకొట్టారు.

అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనకు దిగిన న్యూజిలాండ్ ఆది నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు టిమ్ సీఫర్ట్ (22 బంతుల్లో 45), ఫిన్ అలెన్ (16 బంతుల్లో 32) చెలరేగిపోయారు. వీరిద్దరి ధాటికి న్యూజిలాండ్ 4 ఓవర్లలోనే 50 పరుగుల మార్కును తాకింది. పాక్ స్టార్ పేసర్ షాహీన్ అఫ్రిది వేసిన ఇన్నింగ్స్ 3వ ఓవర్‌లో టిమ్ సీఫర్ట్ శివాలెత్తిపోయాడు. ఈ ఓవర్‌లో సీఫర్ట్ ఏకంగా నాలుగు సిక్సర్లు బాదాడు. అంతకుముందు మొహమ్మద్ అలీ వేసిన రెండో ఓవర్‌లో ఫిన్ అలెన్ కూడా చెలరేగాడు. ఈ ఓవర్‌లో అలెన్ మూడు సిక్సర్లు కొట్టాడు. వీరిద్దరూ క్రీజ్‌లో ఉండగా మ్యాచ్ 10 ఓవర్లలోనే ముగిస్తుందని అంతా అనుకున్నారు. అయితే పాక్ బౌలర్లు ఒక్కసారిగా ఫామ్‌లోకి రావడంతో న్యూజిలాండ్ 31 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయింది. మార్క్ చాప్‌మన్ (1), డారిల్ మిచెల్ (15), జిమ్మీ నీషమ్ (5) తక్కువ స్కోర్లకే ఔట్ కాగా.. మిచెల్ హే (21 నాటౌట్), కెప్టెన్ బ్రేస్‌వెల్ (5 నాటౌట్) న్యూజిలాండ్‌ను విజయతీరాలకు చేర్చారు. న్యూజిలాండ్ 13.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. పాక్ బౌలర్లలో హారీస్ రౌఫ్ 2, మొహమ్మద్ అలీ, ఖుష్దిల్ షా, జహన్‌దాద్ ఖాన్ తలో వికెట్ పడగొట్టారు. ఈ గెలుపుతో న్యూజిలాండ్ 5 మ్యాచ్‌ల సిరీస్‌లో 20 ఆధిక్యంలోకి వెళ్లింది. అంతకుముందు తొలి మ్యాచ్‌లో కూడా న్యూజిలాండ్ పాక్‌ను చిత్తుగా ఓడించింది. మూడో టీ20 ఆక్లాండ్ వేదికగా మార్చి 21న జరుగనుంది. ఈ మ్యాచ్‌లో కూడా ఓడితే పాక్ సిరీస్‌ను కోల్పోతుంది.

## వాళ్లను చూస్తేనే చిరాకు..

### అసలేం చేస్తున్నార్రా బాబూ!: డేల్ స్టెయిన్ ఫైర్

నవతరం ఫాస్ట్ బౌలర్ల తీరుపై సౌతాఫ్రికా దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. పరిస్థితులకు అనుగుణంగా బౌలింగ్ చేయడంలో దారుణంగా విఫలమవుతున్నారని.. ఒత్తిడిలో చిత్తైపోయి పరుగులు సమర్పించుకుంటున్నారని విమర్శించాడు. కనీసం ఒక్కసారి కూడా ఫీల్డింగ్ మార్చకుండానే ఓవర్ పూర్తి చేస్తున్నారని.. ఇదంతా చూస్తే తనకు చిర్రెత్తుకొస్తుందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. అయితే, టీమిండియా పేస్ గుర్రం జస్‌ప్రీత్ బుమ్రా, సౌతాఫ్రికా స్పీడ్‌స్టర్ కగిసో రబడ మాత్రం ఇందుకు మినహాయింపు అని స్టెయిన్ పేర్కొన్నాడు. ఈ మేరకు ఈఎస్‌పీఎన్‌క్రిక్‌ఇన్ఫోలో నేటి తరం ఫాస్ట్ బౌలర్ల గురించి మాట్లాడుతూ.. "ఈరోజుల్లో అంతర్జాతీయ స్థాయి పేసర్ల తీరు నాకు నచ్చడం లేదు.

**వాళ్లను చూస్తేనే చిరాకు..**

ఒక్కసారి కూడా ఫీల్డ్ మార్చకుండానే ఓవర్ పూర్తి చేసేసి వెళ్తున్నారు. పదేళ్లుగా కెరీర్ కొనసాగిస్తున్న వారు కూడా తమకేమీ పట్టదన్నట్లుగా చేతులు దులిపేసుకుంటున్నారు. ఇలాంటి వాళ్లను చూసినపుడు నాకైతే జట్టు పీక్కోవాలనిపిస్తుంది. చిరాకు వస్తుంది. ఇంతకంటే గొప్ప బౌలర్లను మనం చూడలేమా? అని నా మనసు ఆవేదన చెందుతుంది" అని డేల్ స్టెయిన్ చెప్పుకొచ్చాడు.




**బుమ్రా, రబడ మాత్రం వేరు**

అదే విధంగా.. "బుమ్రా మాత్రం ఇందుకు అతీతం. అతడు పరిపూర్ణమైన ప్యాకేజ్‌లాంటివాడు. కగిసో రబడ కూడా బుమ్రా మాదిరే పర్ఫెక్ట్. వాళ్లిద్దరు ఎలాంటి సమయంలోనైనా బౌలింగ్ చేయగలగరు. వికెట్లూ పడగొట్టగలరు. నిజంగా వాళ్లిద్దరు బంగారం. కెప్టెన్‌కు సగం పని తగ్గించేస్తారు. ఇలాంటి వారి సంఖ్య పెరిగితేనే.. ఫాస్ట్ బౌలింగ్ విభాగం మరింత పటిష్టంగా ఉంటుంది. గంటకు 155 కిలో మీటర్ల వేగంతో బౌలింగ్ చేశారా? లేదా? అన్నది ముఖ్యం కాదు. మనలో పది రకాల నైపుణ్యాలు ఉండవచ్చు. కానీ సరైన సమయంలో.. సరైన విధంగా స్పందించి కెప్టెన్ చెప్పిన పని పూర్తి చేస్తేనే దేనికైనా విలువ" అని స్టెయిన్ పేర్కొన్నాడు.

**70 శాతం మంది బౌలర్ల తీరు అలాగే**

ఇక ఇదే షోలో స్టెయిన్‌తో గొంతు కలిపిన న్యూజిలాండ్ పేస్ దిగ్గజం షేన్ బాండ్.. "ఈరోజుల్లో 70 శాతం మంది బౌలర్లకు అసలు తామేం చేస్తున్నామో అన్న స్పృహ ఉండటం లేదు. కెప్టెన్లు మరింత చొరవ తీసుకోవాలి. వారి నుంచి ఎలాంటి ప్రదర్శన కోరుకుంటున్నారో కచ్చితంగా చెప్పాలి. ఫీల్డింగ్ సెట్ చేసే విషయంలోనూ నిక్కచ్చిగా వ్యవహరించాలి" అని అభిప్రాయపడ్డాడు.

**బుమ్రా రీఎంట్రీ ఎప్పుడో?**

కాగా ఇటీవల జరిగిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ 2025కి వెన్నునొప్పి కారణంగా బుమ్రా దూరమైన విషయం తెలిసిందే. అయితే, ప్రధాన పేసర్ లేకుండానే టీమిండియా ఈ మెగా వన్డే టోర్నీలో విజేతగా అవతరించింది. స్పిన్‌కు అనుకూలించే దుబాయ్ పిచ్‌పై అజేయ రికార్డుతో ట్రోఫీని ముద్దాడింది. ఇక బుమ్రా ఇప్పుడిప్పుడే గాయం నుంచి కోలుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ ఆరంభ మ్యాచ్‌లకు అతడు అందుబాటులో ఉండటం లేదు. మరోవైపు.. రబడ చాంపియన్స్ ట్రోఫీలో ఆడాడు. ఈ ఈవెంట్లో సౌతాఫ్రికా న్యూజిలాండ్ చేతిలో ఓడి సెమీస్‌లోనే ఇంటిబాటపట్టింది.




## వెంటిలేటర్‌పై పాక్ క్రికెట్

అంతర్జాతీయ వేదికపై పాకిస్తాన్ క్రికెట్ జట్టు పరిస్థితి నానాటికి దిగజారుతుంది. ఓ సారి వన్డే వరల్డ్‌కప్ (1996), ఓ సారి టీ20 వరల్డ్‌కప్ (2009), ఓ సారి ఛాంపియన్స్ ట్రోఫీ (2017) గెలిచిన ఆ జట్టు ప్రస్తుతం పసికూనలపై గెలిచేందుకు కూడా నానా తంటాలు పడుతుంది. గడిచిన రెండేళ్లలో పాక్ క్రికెట్ జట్టు అదఃపాతాళానికి పడిపోయింది. ఆ జట్టు పరిస్థితి వెంటిలేటర్‌పై ఉన్న రోగిలా తయారైంది. యూఎస్‌ఏ, జింబాబ్వే, ఐర్లాండ్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ లాంటి చిన్న జట్లు సైతం పాక్‌ను మట్టికరిపిస్తున్నాయి. స్వదేశంలో కూడా ఆ జట్టు మ్యాచ్‌లు గెలవలేకపోతుంది. సొంతగడ్డపై జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో కనీసం ఒక్క మ్యాచ్ కూడా గెలవలేక గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. అంతకుముందు స్వదేశంలో న్యూజిలాండ్, సౌతాఫ్రికా పాల్గొన్న ట్రై సిరీస్‌లోనూ పరాజయం పాలైంది. తాజాగా పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న ఆ జట్టు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడింది. ప్రక్షాళన పేరుతో సీనియర్లను పక్కన పెట్టిన పాక్ సెలెక్టర్లు ప్రస్తుతం వస్తున్న ఫలితాలతో నైరాశ్యంలో మునిగిపోయారు. ఇక ఏం చేసినా తమ జట్టు పరిస్థితి బాగుపడదని అనుకుంటున్నారు. భారత్‌లో గల్లీ క్రికెట్ ఆడే జట్లు సైతం పాక్‌ను ఓడించేపరిస్థితులు ఉన్నాయి. న్యూజిలాండ్ పర్యటనకు ముందు పూర్వవైభవం సాధిస్తామని ప్రగల్భాలు పలికిన పీసీబీ.. ప్రస్తుతం వస్తున్న ఫలితాలతో నోరు మెదపకుండా ఉంది. సీనియర్లు బాబర్ ఆజమ్, మహ్మద్ రిజ్వాన్ అన్నా ఉంటే కనీసం ఈ ఘోర పరాజయాల గోస తప్పేదని అనుకుంటున్నారు. న్యూజిలాండ్ పర్యటనలో పాక్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో చిత్తుగా ఓడింది. తొలి మ్యాచ్‌లో కనీసం 100 పరుగులు కూడా చేయలేకపోయిన పాక్ బ్యాటర్లు.. ఇవాళ (మార్చి 18) జరిగిన రెండో మ్యాచ్‌లో ముక్కీ మూలిగి 135 పరుగులు చేశారు. అయినా న్యూజిలాండ్ బ్యాటర్లు విధ్వంసం సృష్టించి పాక్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఊదేశారు. ఈ మ్యాచ్‌లో పాక్ బౌలర్లు గల్లీ బౌలర్లను తలపించారు. వరల్డ్ క్లాస్ బౌలర్ అని చెప్పుకునే షాహీన్ అఫ్రిదికి న్యూజిలాండ్ బ్యాటర్ టిమ్ సీఫర్ట్ చుక్కలు చూపించాడు. ఓ ఓవర్‌లో ఏకంగా నాలుగు సిక్సర్లు బాది పక్కకు కూర్చోబెట్టాడు. మరో పేసర్ మొహమ్మద్ ఆలీని ఫిన్ అలెన్ వాయించాడు. ఆలీ వేసిన ఓ ఓవర్‌లో అలెన్ మూడు సిక్సర్లు కొట్టాడు. వాస్తవానికి ఈ సిరీస్ కోసం క్రికెట్ న్యూజిలాండ్ ద్వితియ శ్రేణి జట్టును ఎంపిక చేసింది. ఛాంపియన్స్ ట్రోఫీ ఆడిన సీనియర్లు ఐపీఎల్ కోసం భారత్‌కు పయనమయ్యారు. 'ఏ' జట్టుతోనే పాక్ పరిస్థితి ఇలా ఉంటే, సీనియర్లు ఉన్న జట్టు ఎదురైనప్పుడు పాక్ పరిస్థితి తలచుకుంటే జాలేస్తుంది. ఇలాంటి దయనీయ పరిస్థితుల్లో పాక్ క్రికెట్‌ను ఆదుకునే ఆపద్బాంధవుడెవరో చూడాలి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com



# ఎట్టకేలకు కిలాడి లేడీ ముఠా అరెస్ట్

- నిందితులను రిమాండ్ కు తరలింపు
- నిందితుల వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్

**వరంగల్, మహా:** ఉమ్మడి వరంగల్ జిల్లాలో సంచలనం రేపిన మైనర్ బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడిన మిస్టరీ వీడింది. వరంగల్ నగరంలోని ఓ మైనర్ బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడిన అనంతరం వ్యభిచారం చేయించేందుకు యత్నిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో ఒక మైనర్ బాలికతో సహా ఒక మహిళ తో పాటు నలుగురు వ్యక్తులను మీల్స్‌కాలనీ పోలీసులు మంగళవారం అరెస్టు చేసారు. వీరి నుండి ఒక కిలో ఎనిమిది వందల గ్రాముల గంజాయితో పాటు ఒక కారు, 75వేల రూపాయల నగదు, నాలుగు సెల్ ఫోన్లతో పాటు ప్రధాన నిందితురాలి ఇంటి వద్ద భారీ స్థాయిలో కండోమ్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితుల వివరాలు.. 1.ముస్కు లత, ల్యాదెల్ల గ్రామం, దామెర మండలం, వరంగల్ జిల్లా, 2.మైనర్ బాలిక, 3.వరంగల్ శంభుని పేటకు చెందిన అబ్దుల్ అఫ్నాన్, షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్, మీర్జా ఫైజ్ బేగ్ ఆలియాస్ వదూద్ లను పోలీసులు అరెస్టు చేసారు.

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడిస్తూ....**

ఈనెల 11వ తేదిన మైనర్ బాలిక కనిపించడం లేదని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు పై మీల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి సదరు బాలికను ములుగు క్రాస్ రోడ్డు వద్ద గుర్తించి బాలికనకు పోలీసుల సంరక్షణలో తీసుకోని విచారించగా తనను కొంత మంది వ్యక్తులు అపహరించి, గంజాయి త్రాగించిన అనంతరం అత్యాచారానికి పాల్పడినట్లుగా సదరు బాలిక పోలీసులకు వెల్లడించడంతో అప్రమత్తమైన పోలీసులు పోలీస్ కమిషనర్ అదేశాల మేరకు సెంట్రల్ డిసిపి షేక్ సలీమా పర్యవేక్షణలో వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ అధ్వర్యంలో మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలుగా ఏర్పడి నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా ఈ వ్యవహారంలో ప్రధాన నిందితురాలైన ముస్కు లత, ల్యాదేళ్ళ గ్రామంలో వ్యభిచార వృత్తిని కొనసాగిస్తూ, తల్లిదండ్రులు మరణించడంతో నిందితురాలికి మరో మైనర్ తన ఇంటిలోనే ఆశ్రయం కల్పించింది. ప్రధాన నిందితురాలు వ్యభిచార వృత్తి కొనసాగిస్తుండంతో తన వృత్తిలో అవసరమైన కొత్త మహిళలు లేదా బాలికలను తీసుకొచ్చి ఈ వ్యభిచారం నిర్వహించడం ద్వారా పెద్ద మొత్తంలో డబ్బు వస్తాయని దానిలో నీకు కొంత డబ్బు ఇస్తానని మైనర్ నిందితురాలకి తెలపడంతో, ఇందుకు సిద్దపడిన మైనర్ నిందితురాలు తన స్నేహితరాలితో పరిచయం కాగా బాధిత బాలికలను లక్ష్యంగా చేసుకొని మైనర్ నిందితురాలు ఇంస్టాగ్రాం ద్వారా బాధిత బాలికతో పరిచయం పెంచుకోవడమే కాకుండా బాలిక స్కూల్ కు వెళ్ళే సమయంలో నిందితురాలు బాధిత బాలికను కలవడంతో పాటు మైనర్ నిందితురాలి ప్రియుడైన నిందితుడు అబ్దుల్ అఫ్నాన్‌తో కలిసి బాలికను తీసుకవెళ్ళి మద్యం, గంజాయి త్రాగటం అలవాటు చేసారు. నిందితురాలి పై మరింత నమ్మకం కలిగేందుకు బాలికకు షాపింగ్ మాల్స్‌కు తీసుకవెళ్ళి బట్టలను ఇప్పించడంతో వీరిపై మరింత నమ్మకం కలిగింది.

## రేవంత్ రెడ్డి ఊసరవెల్లి రాజకీయాలు మానుకో

- ఎం జె ఫ్ జిల్లా అధికార ప్రతినిధి ..దేవపంగుబాబు మాదిగ



**హుజూర్ నగర్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలని ఎం జె ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి దేవపంగు అన్నారు. సుప్రీం కోర్టు ఎస్సి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికి దానిని అమలు చేయకుండా గ్రూప్ 1,2,3 ఫలితాలు వెల్లడించి ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ జారిచేయడం సుప్రీం కోర్టు ను దిక్కరించటమేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నారని దేవపంగు బాబు మాదిగ అన్నారు. మంగళవారం మఠంపల్లి మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు జరుగుతున్న రిలేనిరాహార దీక్షలు మంగళవారం తొమ్మిదవ రోజుకు చేరుకున్నాయి. ఇట్టి దీక్షలలో ఎం జె ఫ్ జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీలు సంఘీభావం తెలిపి దీక్షలో భాగస్వాములయ్యారు. సందర్భంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి మాదాసు గోపి మాదిగ, ఎం జె ఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శి కొమ్ము మహేష్ మాదిగ ఎం జె ఫ్ హుజూర్ నగర్ నియోజకవర్గఅధ్యక్షులు బయ్యారపు రవీంద్ర మాదిగ లు మాట్లాడుతూ అసెంబ్లీలో ఎస్సి వర్గీకరణ పై చర్చ జరుగుతుండగానే గ్రూప్స్ ఫలితాలు వెల్లడించడమే కాకఅవమానించడమే అని అన్నారు. ఎస్సి వర్గీకరణ అమలువిషయంలో మాదిగల సత్తా పాలక ప్రభుత్వానికి చూపుతామన్నారు.ఎం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షులు ఇరుగు ప్రభు అధ్యక్షతన జరిగిన దీక్షలో ఎం జె ఫ్ మండల అధ్యక్షులు పల్లె. సుధాకర్, చిలక సైదులు,ఎం ఎస్ పి మండల అధ్యక్షులు కస్తాల వెంకటేశ్వర్లు, పి ఎ సి ఎస్ మాజీ చైర్మన్ ద్దైద రాయేలు, ఎం ఆర్ పి ఎస్ మండల సీనియర్ నాయకులు కుర్రి శ్రీను, చిన్నపంగు నరేందర్, మంద రమేష్,ఎం ఆర్ పి ఎస్ మఠంపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కూరాకుల సైదులు వర్కింగ్ ప్రెసిడెంట్ కూరాకుల నర్సయ్య,కొత్తపల్లి గణేష్,పొట్టే పంగు అశోక్, కుర్రి నాగేశ్వరరావు,గుండెపంగు సైదులు,గుండెపంగు సురేష్,ఉబ్బపల్లి శ్రీను, గుండెపంగు కృష్ణయ్య,అశోక్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య మండల నాయకులు అమరారపు దేవబిక్షం, మేడి బుంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నంగునూరు వాసి దేవులపల్లి పరశురాములుకు డాక్టరేట్



**సిద్దిపేట జిల్లా, నంగునూరు, మహా:** నిరుపేద కూలీ కుటుంబానికి చెందిన దేవులపల్లి పరుశురాములు, సొంత గ్రామం నంగునూరులో ఉస్మానియా విశ్వవిద్యాలయం,నుంచి అర్థ శాస్త్రం ఉపాధ్యాయ విద్యలో డిగ్రీ పూర్తి చేశారు. రెండు పీజీ పట్టాలు అందుకోవడమే కాకుండా ప్రస్తుతం అక్కడే అర్థశాస్త్రంలో పీహెచ్డీ చదువుతున్నారు. ఈ తరుణంలో టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన టిఆర్టి ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ గా సాంఘిక శాస్త్రం లో ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. తర్వాత ప్రభుత్వ ప్రకటించిన పంచాయతీ కార్యదర్శి గా కూడా కొలువులు దక్కించుకున్నారు. ఇతడి తల్లిదండ్రులు లక్ష్మి, కనకయ్య, వ్యవసాయ కూలీ తనకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ, మిగతా సమయంలో కూలీ పనికి వెళుతుంటారు. వీరికి ఐదుగురు సంతానం, ఉండగా వారిలో మూడో సంతానమే పరశురాం స్వగ్రామం నంగునూరులోని ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నప్పుడు ఉపాధ్యాయుల సహాయంతో వెనుకబడిన తరగతుల విద్యార్థుల వసతి గృహంలో చేరారు. అక్కడే ఉంటూ పదవ తరగతి పూర్తి చేసి నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. పై చదువుల కొరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ ఎకనామిక్స్ లో ఎంట్రెన్స్ లో రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంకు సాధించి. ఎం ఏ ఎకనామిక్స్ లో చేరారు. తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే బి.ఎడ్ మరియు ఎల్.ఎల్.బి విద్యను అభ్యసించాడు. పరశురాములు ప్రస్తుతం సిద్దిపేట జిల్లా, సింగన్నగూడా, జడ్పీ హెచ్ఎస్ ములుగు మండలం పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ తరుణంలోనే ఉస్మాని విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ డైసీ, మేడం ఆధ్వర్యంలో అర్థశాస్త్రంలో పిహెచ్డి పట్టాను పొందారు. పరశురాములు, ప్రభుత్వ ఐదు ఉద్యోగాలు ప్రభుత్వ ఉద్యోగాలను అందిపుచ్చుకొని చిత్తశుద్ధితో కృషి చేస్తే ఏదైనా సాధ్యమేనని తన లక్ష్యం గ్రూప్ 1 సివిల్స్, సాధించడమే తన ముందున్న లక్ష్యం అని అంటున్నారు. డాక్టర్ దేవులపల్లి పరశురాములు.

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపైబీ అట్రాసిటీ కేసు నమోదు

- కేసు నమోదు చేసిన ఎల్బీనగర్ పోలీసులు
- సమన్లు జారీ చేసిన మహిళా కమిషన్



**ఎల్బీ నగర్,మహా:** బీఆర్ఎస్ నేత, ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ కేసు నమోదైంది. తనపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత ఎల్బీ నగర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఎమ్మెల్యేపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా.. ఇటీవల ఎల్బీన గర్ లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య ప్రొటోకాల్ లొల్లి జరిగింది. ఈ నెల 12న మన్సూరా బాద్ డివిజన్లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తాజాగా మరోసారి నిన్న అవే పనులకు మన్సూరాబాద్ బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శంకుస్థాపన చేశారు. అయితే దీనిని స్థానిక బీఆర్ఎస్ కార్యకర్త లు అడ్డుకునే ప్రయత్నం చేశారు.బీఆర్ఎస్ నేతల అరెస్ట్ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తమ కార్యకర్తలకు మద్దతుగా నిలుస్తూ వచ్చి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ పై సీరియస్ అయ్యారు. దీనికితోడు బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, హస్తినాపురం కాంగ్రెస్ కార్పొరేటర్ సుజాత నాయక్ పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు..సుధీర్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశాయి.అనంతరం ఆయనపై సుజాత నాయక్ కంటతడిపెడుతూ డీసీపీ, ఏసీపీ, సీఐలకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎల్బీ నగర్ పోలీసులు ఎమ్మెల్యే పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.

## ఘనంగా ఇంటర్నేషనల్ వాసవి మహిళా సమాఖ్య దశాబ్ది ఉత్సవాలు

- 5000 మంది మహిళలతో లలితా సహస్రనామ పారాయణం



**ఎల్బీనగర్,మహా:** ఇంటర్నేషనల్ వాసవి మహిళా సమాఖ్య ఏర్పడి 10 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు,వుమెన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ వాసవి మహిళా సమాఖ్య ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ ఉప్పల రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నాగోల్ శుభం కన్వెన్షన్ హాల్ లో దశాబ్ది ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ఆర్యవైశ్య ప్రముఖులు,రాజకీయ ప్రముఖుల తో కలిసి ఆంధ్రప్రదేశ్ మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.గౌరవ అతిథులుగా ప్రముఖ గురు శంకర్ జి, ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద గుప్త, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, రాబోవు రోజుల్లో మహిళా రిజర్వేషన్లు రాబోతున్నాయని అన్నారు. మహిళా రిజర్వేషన్లు అమలు అయితే 33% నుంచి 50% అవకాశాలు మహిళలకు దక్కనున్నాయని తెలిపారు. ఇంత మంది మహిళలతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉప్పల రాజ్యలక్ష్మి వంటి వారు రాజకీయాల్లో ఎదగాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ..ఐవీఎమ్ఎస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇప్పుడు 20 మంది పిల్లలకి సైకిలు పంపిణీ చేశామని కొందరి పిల్లలకి స్కూల్ ఫీజులు కూడా కట్టామని అన్నారు. మా ముఖ్య ఉద్దేశం మహిళల రాజకీయ ప్రవేశం కానీ రిజర్వేషన్ ప్రకారము మహిళలు కూడా రాజకీయాల్లో అవకాశం ఇవ్వాలని ఆమె కోరారు. బాల కార్మిక నిర్మూలన, మహిళా సాధికారత, మహిళలను గౌరవించడం, ఆడపిల్లలను చదివించడం ఐవిఎంఎస్ యొక్క ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.

## పారిశ్రామిక పార్కుకు వ్యతిరేకంగా రైతుల ధర్నా

- ఇబ్రహీంపట్నం ఆర్డీవోకు వినతి పత్రం అందజేత
- మా భూములు ఇచ్చేది లేదని తేల్చేసిన రైతులు
- భూ వ్యతిరేక పోరాట కమిటీ మొండి గౌరెల్లి



**రంగారెడ్డి జిల్లా, మహా :** పారిశ్రామిక పార్కు కోసం భూములను ఇవ్వడానికి సిద్ధంగా లేమని మొండి గౌరెల్లి రైతులు తేల్చి చెప్పారు. యాచారం మండల పరిధిలోని, మొండి గౌరెల్లి గ్రామ, పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భూములు కాపాడుకోవడానికి పోరాటాలు చేయాలని నిర్ణయించారు. భూములు వదులుకుంటే జీవితాలు నాశనం అవుతాయని రైతులు, రైతు కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. పేద రైతుల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం కంపెనీల పేరుతో తీసుకోవటం తీవ్ర అన్యాయమని మండిపడ్డారు. ముఖ్యంగా గ్రామంలో భూముల కోసం ఎవరు వచ్చినా తరిమికొడతామని హెచ్చరించారు. రాజకీయాలకతీతంగా గ్రామస్తులమంతా ఉధ్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నంలోని ఆర్డీవో కార్యాలయానికి భారీ ఎత్తున చేరుకున్న రైతులు, ప్రజలు ధర్నా చేపట్టారు. పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేసినట్లయితే రైతుల కుటుంబాలు రోడ్డున పడతాయని వెంటనే ప్రభుత్వం భూ సేకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో సాగుకు యోగ్యంగా లేని గుట్టలు, చెట్లతో, కూడిన భూములను మాత్రమే తీసుకోవాలని నిర్ణయించామని తెలపగా, తమ గ్రామాన్ని సందర్శించి భూముల వివరాలను సేకరించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో మేకల యాదగిరి రెడ్డి, మర్రిపల్లి అంజయ్య యాదవ్, బండిమీద కృష్ణ మాదిగ, తాండ్ర రవీందర్, సంగెం రవి, గోడ కొండ్ల ప్రవీణ్, కుంచారపు సందీప్ రెడ్డి, యాస ముత్యాల రెడ్డి, గుర్రం రాఘవరెడ్డి, బడే కుమార్, నక్క శ్రీనివాస్ యాదవ్, గడల రాములు, గుర్రం మల్లారెడ్డి, కట్టెల అంజయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ పంచాయితీ కార్మికునికి గాయాలు


**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని పాలడుగు గ్రామ పంచాయితీలో సపాయి కార్మికుడిగా పనిచేస్తున్న కొంపల్లి సోమయ్య విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడటంతో, ఆయనకు నాణ్యమైన వైద్యం అందించి, కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. విలేకరులతో మాట్లాడుతూ తన పనిలో నిమగ్నమైన సోమయ్య, ప్రమాదవశాత్తు ట్రాక్టర్ నుంచి జారి పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. ప్రస్తుతం ఆయన తీవ్రంగా బాధపడుతున్నారని, ఎస్సి సామాజిక వర్గానికి చెందిన ఈ నిరుపేద కార్మికుడి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని, అలాగే కుటుంబానికి ఆర్థిక సాయం అందించాల్సిందిగా డిమాండ్ చేశారు. పేద కార్మికులు తమ విధుల్లో ప్రమాదాలకు గురి అయినప్పుడు వారిని నిర్లక్ష్యం చేయకుండా, వైద్య సేవలు, మెరుగైన సదుపాయాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు. గ్రామ పంచాయితీ స్థాయిలో శ్రమించే కార్మికులు అలాంటి ప్రమాదాల బారిన పడితే వారిని ఆదుకునే విధంగా ప్రత్యేక నిధులు ఏర్పాటు చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోవాలో పునర్విమర్శించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అని అన్నారు.

## వరంగల్ తూర్పులో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



**వరంగల్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ 42 శాతం తో పాటు ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిన సందర్భంగా కొండా దంపతులు ఆదేశాల మేరకు కొండా దంపతుల నాయకత్వంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని పోచమ్మ మైదాన్ జంక్షన్ లో ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయశాఖ మాత్యులు కొండా సురేఖ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల్ నవీన్ రాజ్. ఈ సందర్భంగా గోపాల్ నవీన్ రాజ్ మాట్లాడుతూ కొండా దంపతుల నాయకత్వంలో వరంగల్ పోచమ్మ మైదాన్ జంక్షన్లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి పై తెలిపిన వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నామని తెలిపారు. సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ రాష్ట్ర క్యాబినెట్లో తీర్మానం చేసి శాసనసభలో శాసనమండలిలో బిల్లు పాస్ చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రికి దక్కుతుందని అన్నారు.

## కార్పొరేటర్ 'కొప్పుల' భాగోతం ఆధారాలతో బయట పెడ్తా



**ఎల్బీ నగర్,మహా:** మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అవినీతి, రాజకీయ భాగోతం త్వరలోనే ఆధారాలతో బయట పెడతామని బీఆర్ఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ నాయకుడు జక్కిడి రఘువీర్రెడ్డి హెచ్చరించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్రెడ్డి శంకుస్థాపనలు చేసిన అభివృద్ధి పనులకు తిరిగి కొబ్బరి కాయలు కొడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి ని ప్రశ్నించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ కార్యకర్తలను గంజాయి బ్యాచ్లంటూ విమర్శించడంపై ఆయన ఫైర్ అయ్యారు. మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలోని ఆయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్మీట్లో ఆయన మాట్లాడుతూ.. గంజాయి బ్యాచులు, బ్రోతల్ హౌస్ నిర్వాహకులు, క్యాసినో ఆట నిర్వాహకులంతా కొప్పుల నర్సింహ్మారెడ్డి ప్రధాన అనుచరులేనని మరువొద్దని హితవు పలికారు. ఆయన అనుచరులపైనే ఈ తరహా కేసులు ఎన్నో ఉన్నాయని త్వరలో బయటపెడతామని హెచ్చరించారు. ఎల్బీనగర్నియోజకవర్గంలోనే బ్లాక్మెయిల్కార్పొరేటర్కొప్పుల అని విమర్శించారు. మన్సూరాబాద్డివిజన్లో కొత్త ఇండ్లు కట్టేందుకు ఇటుక, ఇసుక పడితే చాలు గద్దల్లా వాలిపోయే ఆయన పీఏల భాగోతం అందరికీ తెలిసిందే అన్నారు. కార్పొరేటర్ పోలీస్పహారాలో చేసిన పనులకు తిరిగి శంకుస్థాపనలు చేస్తుంటే అడ్డుకునేందుకు వచ్చిన వారు డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్కార్యకర్తలేనని, కానీ ఆయన వెంట వచ్చిన వారు ఒక్కరూ బీజేపీ కార్యకర్తలు లేరన్నారు. ఆయన కొప్పుల నర్సింహ్మారెడ్డి కాదని కుటిల రాజకీయాలు చేసే కుటిల నర్సింహ్మారెడ్డి అని విమర్శించారు. పోలీసు పహారాల్లో తిరిగే కార్పొరేటర్ ప్రజలకు ఏం న్యాయం చేస్తాడో చెప్పాలని రఘువీర్రెడ్డి ప్రశ్నించారు. పొద్దున బీజేపీ కండువా వేసుకొని తిరిగే నర్సింహ్మారెడ్డి సాయంత్రం అయితే కాంగ్రెస్ పార్టీ నేత మధుయాష్కీ గౌడ్ తో మంతనాలు సాగిస్తున్నది ప్రజలు గమనిస్తున్నారన్నారు. హిందూత్వం పేరు చెప్తూ పబ్బం గడుపుకుంటున్న ఆయనను చూసి అసలు సిసలైన బీజేపీ కార్యకర్తలు ఆయ కింద పనిచేయాలంటే బాధపడుతున్నారన్నారు. వీడియోల మార్ఫింగ్లతో మొదలైన కొప్పుల అవినీతి భాగోతం.. డబుల్రిజిస్ట్రేషన్లకు బ్రాండ్అంబాసిడర్గా ఎదిగిన సంగతి అందరికీ విధితమే అన్నారు. హస్తినాపురం కార్పొరేటర్సుజాత అంటే తమకు ఎంతో గౌరవం ఉందని, ఆమెను సుధీర్రెడ్డి వ్యక్తిగతంగా విమర్శించలేదని ఈ సందర్భంగా రఘువీర్అన్నారు. నియోజకవర్గంలో టూరిస్ట్పొలిటీషియన్మధుయాష్కీగౌడ్ ఆధ్వర్యంలో కుటిల నర్సింహ్మారెడ్డి, చంపాపేటలో చెల్లని కార్పొరేటర్ వంగా మధుసూదన్రెడ్డి, కాంగ్రెస్లో చేరేందుకు రంగం చేసుకునే నియోజకవర్గంలో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. చిన్న చెరువు తాము కబ్జా చేశామని మధుయాష్కీ ఆరోపణలు చేశాడని.. ఈ విషయంపై ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నామని, సర్వే నెంబర్ 93తో పాటు, డివిజన్లోని చిన్న చెరువు పరిసరాల్లోని భూములపైన సర్వే చేయించాలని రఘువీర్రెడ్డి డిమాండ్ చేశారు.

## కొత్తపల్లి పోలీసుస్టేషన్ ను తనిఖీ చేసిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్





**కరీంనగర్, మహా :** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ను మంగళవారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఆకస్మిక తనిఖీ చేసారు. పోలీసు స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాదీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగారు. పోలీస్ స్టేషన్ లో హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. వారికి కేటాయించబడిన విధులు అడిగి తెలుసుకున్నారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సిసిటిఎన్ఎస్ లో పొందుపరచాలన్నారు. పెండింగ్ కేసులపై సమీక్ష చేసారు. వాటికి గల కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు. నమోదైన సైబర్ నేరాల గురించి తెలుసుకున్నారు. అర్బన్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల వారీగా పోలీసు స్టేషన్ పరిధిలోని అన్నీ గ్రామాలకు పోలీసు అధికారులను కేటాయించాలని ఆదేశించారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేసారు. పోలీసు స్టేషన్ లో అన్ని రకాల విధులను సక్రమంగా నేర్చుకోవాలన్నారు. రికార్డ్ నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షను, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, సమన్లు మొదలుగు విధులను సీనియర్ల ద్వారా తెలుసుకోవాలన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరని తెలిపారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ. ప్రొబెషనరీ ఐపీఎస్ వసుంధర ఫొరెబి ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## హుజూర్ నగర్ ప్రభుత్వ పెన్షనర్లకు రాష్ట్ర స్థాయి బహుమతులు



**హుజూర్ నగర్,మహా :** సూర్యాపేట జిల్లా కోదాడలో మూడు రోజుల నుండి జరిగిన రాష్ట్రస్థాయి ప్రభుత్వ పెన్షనర్ల క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో హుజూర్నగర్ కు చెందిన పలువురు క్రీడాకారులకు రాష్ట్రస్థాయి బహుమతులు లభించాయి. క్యారమ్స్ లో రాష్ట్రస్థాయిలో హుజూర్ నగర్ కు చెందిన వర వెంకట్ రెడ్డి, కోదాడకు చెందిన నరసింహారావు లకు ప్రథమ బహుమతి లభించింది. చెస్ పోటీలో పారుపల్లి చంద్రశేఖర్ కు మూడవ బహుమతి, లభించించగా ఏకపాత్రలో ధర్మారి వెంకటేశ్వర్లకు ప్రథమ బహుమతి కవితల్లో నందిగామ రత్నకుమార్ కు తృతీయ బహుమతి లభించింది. వీరంతా సూర్యాపేట జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్రస్థాయిలో హుజూర్ నగర్ కు నాలుగు బహుమతులు లభించడం పట్ల హుజూర్నగర్ మండల ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు చెన్నా సోమయ్య, ప్రధాన కార్యదర్శి కొప్పుల వీరారెడ్డిలు హర్షం చేశారు. విజేతలకు నూతనంగా ఎమ్మెల్సీగా ఎంపికైన శ్రీపాదరెడ్డి, రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దామోదర్ రెడ్డి, చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రావెళ్ళ సీతారామయ్యలు బహుమతి ప్రధానం చేశారు.

## ముఖ్యమంత్రి పై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదు



**రంగారెడ్డి జిల్లా, మహా :** ముఖ్యమంత్రి పై అనుచిత వాఖ్యలు చేసిన మహిళపై ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్ ఫిర్యాదు చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనమల రేవంత్ రెడ్డి పై అనుచిత వాఖ్యలు చేసిన మహిళా పై, పిసిసి కార్యదర్శి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో ఎస్సై రాజుకు పిర్యాదు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతున్న నేపథ్యంలో ఓర్వలేక ఇతర పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం పై, బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, ముఖ్యమంత్రిని దూషించి మాట్లాడడం సమంజసం కాదని మండిపడ్డారు. సదరు మహిళ చేసిన వాఖ్యలు కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదిభట్ల ఎస్ఐ రాజుని కోరిన కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్. రాష్ట్ర ముఖ్యమంత్రిపై ఇలాంటి అనుచిత వాఖ్యలు చేసి, ప్రభుత్వం పై బురదజల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని, తగిన రీతిలో బుద్ధి చెప్తామని ఆమె హెచ్చరించారు.